జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 7 సంచిక 90 | హైదరాబాద్, జూన్ 14 బుధవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

### మహిళా సంక్షేమంలో తెలంగాణ...

# యావత్ దేశానికే ఆదర్శం

## మంత్రి కేటీఆర్

**ఆకాశంలో సగం కాదు.. "ఆమే" ఆకాశం**
**సంక్షేమంలో సగం కాదు.. "ఆమే" అగ్రభాగం**
**మహిళా సంక్షేమంలో..**
**మన తెలంగాణ రాష్ట్రం..**
**యావత్ దేశానికే ఆదర్శం..**
**అప్పుడే పుట్టిన ఆడబిడ్డ నుంచి**
**ఆరు పదులు దాటిన అవ్వల వరకు**
**అందరినీ కంటికి రెప్పలా కాపాడుతోంది**
**మనసున్న కేసీఆర్ సర్కార్**





హైదరాబాద్: మహిళా సంక్షేమంలో తెలంగాణ యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ సర్కార్ అప్పుడే పుట్టిన ఆడబిడ్డ నుంచి ఆరు పదులు దాటిన అవ్వల వరకు అందరినీ కంటికి రెప్పలా కాపాడుతుందని తెలిపారు. ఆకాశంలో సగం కాదు.. ఆమే ఆకాశం అని.. సంక్షేమంలో సగం కాదు.. ఆమే అగ్రభాగం అని వ్యాఖ్యానించారు. అమ్మఒడి వాహనమైనా.. ఆరోగ్యలక్ష్మి పథకమైనా.. నీతి ఆయోగ్ ప్రశంసల వర్షం.. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ హర్షం దక్కిందని అన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. భర్తను కోల్పోయిన అక్కాచెల్లెళ్లకు అన్నలా.. ఒంటరి మహిళలకు తండ్రిలా.. ఆడబిడ్డలకు మేనమామలా.. అవ్వలకు పెద్దకొడుకులా.. కొండంత అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మనసారా ఆశీర్వదిస్తున్న యావత్ మహిళా లోకానికి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ ఆయన ట్వీట్ చేశారు. కల్యాణలక్ష్మి కేవలం పథకం కాదు... ఒక విప్లవం అని తెలిపారు. ఓవైపు భ్రూణహత్యలకు బ్రేక్ వేసిందని.. మరోవైపు బాల్యవివాహాలకు ఫుల్ స్టాప్ పెట్టిందని.. ఇంకోవైపు తల్లిదండ్రుల భారాన్ని దించే భరోసా అని పేర్కొన్నారు. పదిలక్షలకుపైగా ఆడబిడ్డల పెండ్లిళ్లు చేసిన మేనమామ సీఎం కేసీఆర్ అని కొనియాడారు. గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్లదూరం నడిచిన మహిళల కష్టాలను మిషన్ భగీరథతో శాశ్వతంగా తీర్చిన విజన్ ఉన్న ముఖ్యమంత్రి.. కేసీఆర్ అని అన్నారు. మన అంగన్వాడీలను, ఆశా కార్యకర్తలను వెవట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించి.. దేశంలోనే అత్యధిక పారితోషికాలు ఇచ్చి గౌరవప్రదంగా జీవించే అవకాశం కల్పించారన్నారు. ఆడబిడ్డల సంక్షేమంలో మనకు ఎదురులేదని.. మహిళా సాధికారతలో తెలంగాణకు తిరుగులేదని వ్యాఖ్యానించారు.

# హీటెక్కుతున్న ఖమ్మం..

## ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే



ఖమ్మం:తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు మరో ఐదు నెలల సమయం ఉంది. ఈ క్రమంలో పార్టీలన్నీ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. సమయం దగ్గర పడుతుండటంతో పలు పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నాయి. గెలుపు గుర్రాలను రంగంలోకి దించేందుకు పార్టీలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఎక్కడ ఏ అభ్యర్థిని రంగంలోకి దించాలనే దానిపై ప్రముఖ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రాజకీయాలు వేడెక్కిపోతున్నాయి. నువ్వా.. నేనా అన్నట్లు ఇప్పటి నుంచి పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మం జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఖమ్మం జిల్లా పాలేరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.కొద్ది రోజులు ముందే ఎన్నికల ప్రచార రథాన్ని సిద్దం చేసిన ఎమ్మెల్యే.. మంగళవారం ప్రచార రథానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ముందుగా కూసుమంచి మండలం ముత్యాల గూడెం గ్రామంలో ఈ ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందాల టీవీ9తో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లా రాజకీయాలు హీటెక్కాయని అన్నారు. పాలేరులో మా ప్రత్యర్థి కాంగ్రెస్ అని, పాలేరులో గట్టి పోటీ ఉంటుందని, రాజకీయాలు అంటేనే పోటీ అని అన్నారు. నేను ఎపుడూ ప్రజల్లోనే ఉన్నాను.. ఎన్నికలు సమయం వచ్చింది కనుక ఎక్కువ తిరుగుతున్నాం.. ముఖ్యమంత్రి కేసీఆర్ సిట్టింగ్‌ల టికెట్స్ ఇస్తామన్నారని అన్నారు. టికెట్ గురించి ఆలోచనే లేదన్నారు. నాకు ఎన్నికల కోసం ప్రత్యేక వ్యూహాలు అవసరం లేదని పేర్కొన్నారు.

# దయాకర్ రెడ్డి అంతిమయాత్రలో చంద్రబాబు..



### పాడె మోసిన టిడిపి అధినేత

చిన్న చింత కుంట: ఉమ్మడి రాష్ట్రంలోని అమ్మరచింత నియోజకవర్గ మాజీ ఏంఎల్ఏ కోత్తకోట దయాకర్ రెడ్డి అనారోగ్యంతో కన్నుమూశారు. కాగా ఆయన అంత్యక్రియలకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరైయ్యారు. దయాకర్ రెడ్డి పార్థివ దేహనికి నివాళు లర్పించారు..కాగా దయాకర్ రెడ్డి తనయుడు సిద్దార్థ్ రెడ్డిని చంద్రబాబు నాయుడు ఓదార్చారు. మాజీ ఏంఎల్ఏ సీతమ్మను ఓదార్చారు. అనంతరం దయాకర్ రెడ్డి అంతిమ యాత్రలో చంద్రబాబు నాయుడు పాల్గొని పాడె మోశారు.

# యూపీఎస్సీ ప్రిలిమ్స్‌లో తెలుగోళ్ల సత్తా..

### మెయిన్స్‌కు ఏకంగా 600 మంది ఎంపిక



హైదరాబాద్: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, ఐఎఫ్ఎస్ ప్రిలిమినరీ పరీక్ష 2023 ఫలితాలు సోమవారం (జూన్ 12) విడుదలైన సంగతి తెలిసిందే. మే 28వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలకు దేశవ్యాప్తంగా దాదాపు 6 లక్షల మంది వరకు హాజరయ్యారు. తాజాగా విడుదలైన ప్రిలిమ్స్ ఫలితాల్లో దేశ వ్యాప్తంగా దాదాపు 14,624 మంది మెయిన్ పరీక్ష రాసేందుకు అర్హత సాధించారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి 600 మంది ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఈ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 71,128 మంది దరఖాస్తు చేయగా.. వారిలో సుమారు 45,000ల మంది పరీక్ష రాశారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 200లకు కటాఫ్ మార్కులు 80 వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఐతే యూపీఎస్సీ మాత్రం ఇప్పటివరకూ కటాఫ్ మార్కులను అధికారికంగా ఇంకా వెల్లడించలేదు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించినవారు మెయిన్ పరీక్షలకు హాజరుకావడానికి తప్పనిసరిగా డిటైల్డ్ అప్లికేషన్ ఫామ్-1 పూరించవల్సి ఉంటుంది. తుదుపరి దశ అయిన మెయిన్ పరీక్షలు సెప్టెంబరు 15 నుంచి 5 రోజులపాటు జరగనున్నాయి. కాగా మొత్తం 1105 పోస్టులకు యూపీఎస్సీ నియామక ప్రక్రియ చేపడుతోంది.



## సమయం లేదు.. ఇక సిద్ధమవ్వండి..

### కార్పొరేటర్లతో మంత్రి కేటీఆర్ కీలక భేటీ

హైదరాబాద్: జీహెచ్ఎంసీ బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అయితే ఈ నెల 16 న జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. ఈ కార్యాలయంతో రాష్ట్ర రాజధానిలో పాలన మరింత బలోపేతమవుతుంది తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణ స్ఫూర్తితోనే వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లకు కొన్ని కీలక సూచనలు చేశారు. వార్డు కార్యాలయ వ్యవస్థను కార్పొరేటర్లు విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు ఆయా వార్డుల్లో పార్టీ శ్రేణుల్ని ఎన్నికల కోసం సిద్ధం చేయాలని సూచించారు. ఏడాది పాటు పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయాలని దిశా నిర్దేశం చేశారు.

# నేడు రాజమౌళి, ప్రభాస్ లతో అమిత్ షా భేటీ..



హైదరాబాద్ : తెలంగాణలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు నేడు సాయంత్రం కేంద్ర హోం మంత్రి హైదరాబాద్ కు రానున్నారు.. ఆయన శంషాబాద్ లోని నోవాటెల్ హోటల్లో బస చేయనున్నారు.అదే రోజు రాత్రి తెలుగు సినీ అగ్ర కథానాయకుడు ప్రభాస్ , స్టార్ డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి తో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల సమాచారం.కాగా, వివిధ రాష్ట్రాల్లో పర్యటించినప్పుడు సమాజంలో వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులను అమిత్‌షా కలుస్తున్న సంగతి తెలిసిందే. గతంలో హైదరాబాద్‌లో పర్యటించినప్పుడు జూనియర్ ఎన్టీఆర్, నితిన్, మిథాలీ రాజ్ తదితరులను కలిశారు. ఇప్పుడు ప్రభాస్, రాజమౌళిలను కలవనున్నట్లు సమాచారం. జూన్ 16న 'ఆది పురుష్' విడుదలకానున్న నేపథ్యంలో ప్రభాస్‌ను అమిత్‌షా కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ భేటీపై అటు ప్రభాస్-రాజమౌళి, ఇటు భాజపా వర్గాల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇక గురువారం నాడు ఉదయం శంషాబాద్‌లో పార్టీ కార్యకర్తలతో అల్పాహార సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత భద్రాచలం వెల్లి అక్కడ భద్రాద్రి రామయ్యను దర్శించుకుంటారు.. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభకు అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరవుతారు. అదే రోజు రాత్రి ఢిల్లీ బయలుదేరి వెళతారు..

ప్రజాపాలన
బహుజన రాజ్యాధికారమే
ప్రజా పాలన పేపర్ లక్ష్యం
ప్రతి బహుజనుడి సమస్య
వార్త కావాలి
సమస్యల పరిష్కారానికి అడుక్కునే సంస్కృతిని
సమాధి చేయాలి
ప్రతి బహుజనుడి ఇంట్లో
ప్రజాపాలన పేపర్ ఉండాలి
ప్రతి బహుజనుడిని మేల్కొలపండి
అంబేడ్కర్ ఆశయాన్ని నెరవేర్చండి
డాక్టర్. కె. శివభాగ్యారావు బహుజన్,IRS-vrs
చైర్మన్ & ఫౌండర్ స్నేహా గ్రూప్

## అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



ఆసిఫాబాద్ జిల్లా జూన్13 (ప్రజాపాలన,ప్రతినిధి) : అక్రమంగా తరలిస్తున్న కలప పట్టిన సంఘటన ఆసిఫాబాద్ రేంజి పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి కారులో( ఏపీ01ఆర్ 4251) అక్రమంగా కలప తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు అటవీ అధికారులు డోర్లి గనుల ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించారు. అటువైపుగా కలపతో వస్తున్న కారు డ్రైవర్, దానితో పాటు వస్తున్న బైక్ పై ఉన్న వ్యక్తులు అధికారులను గమనించి వాహనాలను వదిలి పారిపోయారు. వాహనం వద్దకు వెళ్లి చూడగా కలప ఉండడంతో అధికారులు వాహనాలను స్వాధీనం చేసుకుని దుంగలు, వాహనాలు రేంజ్ కార్యాలయానికి తరలించారు. వాహనంలో 14 దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు, ఈ దుంగలు 0.394 సెంటి మీటర్లు ఉండి, 27904 రూపాయల విలువ వచ్చిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా కలప తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్, తిర్యానీ రేంజ్ సెక్షన్ అధికారులు విజయ్ కుమార్, బీట్ అధికారులు స్వప్న, ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## భారత సురక్ష సమితి జోనల్ స్థాయి సమావేశం



శంకరపట్నం జూన్ 13 ప్రజాపాలన రిపోర్టర్: భారత సురక్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిట్టబోయిన అశోక్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని లింగపూర్ గ్రామములో మంగళవారం జోనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అశోక్ కుమార్ మాట్లాడుతూ 1975 ఎమర్జెన్సీ సమయంలో దేశంలోని చాలామంది యువకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమం చేసిన ప్రజా సంగ్రామ పోరాట యోధులు ఈ రోజుల్లో వారి మనుగడ జీవన పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని కనీసం ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ఆనాటి స్వాతంత్ర సమరయోధులకు కల్పించే మౌలిక సదుపాయాలు, ఈ ప్రజా సంగ్రామ పోరాట యోధులకు కూడా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షన్ ,మెడికల్, ఉచిత రవాణా సదుపాయం, వారి కుటుంబానికి ఉపాధి కల్పన, అధికార లాంచనాలతో అంత్యక్రియలు జరిపించాలని, వారి పోరాటాల చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత సురక్ష సమితి రాష్ట్ర కార్యదర్శి అంతం వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజమౌళి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్యాం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## నిజ జీవితంలో కూడా ఆచరించాలి



**అబ్దుల్ రెహమాన్, సాహేరా భాను**

ఆసిఫాబాద్ జిల్లా జూన్ 13 (ప్రజాపాలన ప్రతినిధి): వేసవి సెలవుల్లో పొందిన శిక్షణలో నేర్చుకున్న అంశాలు నిజ జీవితంలో ఆచరించి ముందుకు సాగాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సాహెర భాను, టీయూడబ్ల్యూజే -ఐజేయు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ లు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మదర్స అరేబియా మదిన తులం లో వేసవి సెలవుల్లో నిర్వహించిన ఇస్లామిక్ క్లాసెస్ ముగింపు కార్యక్రమంలో హాజరై మాట్లాడారు. వేసవి సెలవుల్లో పిల్లల సమయాన్ని వృధా కాకుండా ఇస్లామిక్ ప్రాథమిక విద్య, అరబ్బీ , నమాజ్ , వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం పై మదర్స నిర్వాహకులను అభినందించారు.సమాజంలో గౌరవప్రదంగా జీవించే అలవాట్లు అలవర్చుకోవాలన్నారు.ఇలాంటి మంచి అంశాలు నేర్చుకొని భవిష్యత్తులో ఆదర్శంగా జీవించేతందుకు తోడ్పడతాయన్నారు.చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని సాధించాలని పిలుపునిచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను మదర్స నిర్వాహకులు శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బూతుల్ అన్సారి, టీయూడబ్ల్యూజేఏఫ్ జిల్లా అధ్యక్షుడు సలీం బెగ్, నూర్ మస్జిద్ అధ్యక్షుడు గౌస్ ఖాన్, సలాం బీన్ హస్సన్, జామిల్, జాఫర్ సాదిక్ హుస్సేన్, విద్యార్థులు, పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా మహిళ సంక్షేమ దినోత్సవం

## మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది

### జిల్లా కలెక్టర్ ఐదావత్ సంతోష్



మంచిర్యాల బ్యూరో, జూన్ 13, ప్రజాపాలన:మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లాలో మహిళా సంక్షేమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్రంలోని ఎఫ్.సి.ఎ. ఫంక్షన్ హాల్ లో మహిళా జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్రావు, జిల్లా సంక్షేమశాఖ అధికారి కె. చిన్నయ్యతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన.. అనంతరం 9 సంవత్సరాల ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళు _న్నారని తెలిపారు. కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్, కె.సి.ఆర్. కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్యలక్ష్మి, ఆసరా పెన్షన్లు, ఆరోగ్య మహిళా కేంద్రాలు, షీ టీమ్ ఏర్పాటు లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం మహిళ సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళల ఆత్మగౌరపం, భద్రత, ఆర్థిక స్వావలంబన, మహిళ ఉద్యోగుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

**మహిళ సంక్షేమం - అభివృద్ధి పథకాలు.**

అంగన్వాడీ టీచర్లు, మినీ అంగన్వాడీ టీచర్లకు వేతనం 2 వేల 200 రూపాయల నుండి 7 వేల 800 రూపాయలకు వేతనం పెంచడం జరిగిందని, ఆశా వర్కర్ల వేతనం 9 వేల 200 రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. 2014కు ముందు 19 వేల 952 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా రాష్ట్ర ఏర్పాటు తరువాత దాదాపు 35 వేల 700 అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసుకొని ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, 6 నెలల నుండి 3 సం?ల నుండి వయస్సు ఉన్న బాలలకు బాలామృతం, గ్రుడ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవం జరిగిన మహిళలకు కె.సి.ఆర్, కిట్తో పాటు అమ్మాయి అయితే 13 వేల రూపాయలు, అబ్బాయి అయితే 12 వేల రూపాయలు ఇవ్వడం, వారికి వ్యాక్సిన్, మందులను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు, ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని వసతులు కల్పించడం ద్వారా గర్భిణులకు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రసవాలు చేయడం జరుగుతుందని తెలిపారు, గర్భిణుల సంక్షేమం కోసం న్యూట్రిషన్ కిట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళల ఆరోగ్యం సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య మహిళా కేంద్రాల నేపథ్యంలో జిల్లాలో 4 కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం జరుగుతుందని తెలిపారు.

**చట్టపరమైన రక్షణ**

వేధింపులకు గురైన మహిళలు, బాలికల కోసం రక్షణ, అన్ని రకాల న్యాయ సేవలు అందించేందుకు సఖి కేంద్రాల ద్వారా కృషి చేస్తున్నామని, పోలీసు శాఖ ఆధ్వర్యంలో షీ టీమ్లను ఏర్పాటు చేసి రక్షణ కల్పించడం జరుగుతుందని, ఇందు కొరకు ఒక హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేసి ప్రతి క్షణం పర్యవేక్షించడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా సి.సి. కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. మహిళా సంక్షేమం, సాధికారత కోసం మోటార్ డ్రైవింగ్ శిక్షణ, 35 శాతం రాయితీ ఇస్తూ షీ టాక్సీ పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికల విద్య కోసం రాష్ట్ర వ్యాప్తంగా 475 కస్తూరిభా బాలికల విద్యాలయాలు, విదేశీ విద్య చదువుకునే ఎస్.సి., ఎస్.టి., ఈ.బి.సి., మైనార్టీ యువతులకు 20 లక్షల రూపాయలు ఉపకార వేతనాలు అందించడం జరుగుతుందని, మార్కెట్ కమిటీలలో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించడం జరిగిందని, స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు పడక గదుల ఇండ్ల పథకం, దళిత బంధు, సాంఘిక సంక్షేమ ఇండ్ల పట్టాల పథకాల క్రింద మహిళా లబ్దిదారులకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రం ఏర్పాటుకు ముందు 92 శాతం ఉన్న మాతాశిశు మరణాలను 43 శాతానికి తగ్గించడం జరిగిందని. 39 శాతం ఉన్న శిశు మరణాల రేటు 21 శాతానికి తగ్గిందని తెలిపారు. ఇలా అనేక పథకాల ద్వారా ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. రమేష్, షీ టీమ్ ఎస్.ఐ. ఓబులమ్మ, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మెట్టుపల్లిలో కవ్వంపల్లి పర్యటన



శంకరపట్నం జూన్ 13 ప్రజాపాలన రిపోర్టర్: పల్లే పల్లెకు కవ్వంపల్లి గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శంకరపట్నం మండలం మెట్ పల్లి గ్రామంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ రెండో రోజు పర్యటించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్లు గడిచిన ఆ సంతోషం తెలంగాణ ప్రజానీకానికి మిగలలేదని అన్నారు. అకాల వర్షాలతో వరదలు వడగండ్లతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందనీ, 9ఏళ్లు గాడిచిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితులు మారలేదని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు ఇప్పటికి ఇంకా రైతులకు చెల్లించలేదు కానీ సంబరాల పేరుతో వందల కోట్లు ఖర్చు, తెలంగాణ ప్రజానీకానికి ఏం న్యాయం జరిగిందని దశాబ్ది సంబరాలు జరుపుతున్నారని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నీళ్లు,నిధులు,నియామకాలు అని మాయ మాటలు చెప్పి, తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇన్ పుట్ సబ్సిడీ, పనిముట్ల పై సబ్సిడీ ఇవ్వకుండా రైతులకు తీవ్ర నష్టం చేస్తుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే ఏక కాలంలో రూ. 2 లక్షల రైతు రుణ మాఫీ చేస్తాం అని, రూ. 500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, సొంత స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల సాయం చేస్తామని, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని, ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే కనీస పించన్ రూ. 5000 ఇస్తామని, అధికారం లోకి వచ్చిన మొదటి ఏడాది 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ధరణి పోర్టల్ ను రద్దు చేస్తామని, భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు ఎకరానికి రూ. 15 వేల సాయం, భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు రూ. 12 వేల సాయం అందిస్తామని అన్నారు.రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనీ అధికారం లోకి తీసుకువచ్చి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన సోనియా గాంధీ ఋణం తీర్చు కోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గోపగోని బస్వయ్య, మాజీ సర్పంచ్ పోచయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు గట్టయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఓదెలు, శ్రీనివాస్, రవి, ఓంకార్, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం!!

**వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే :ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ కమిటీ**



ఎర్రుపాలెం జూన్ 13 ప్రజా పాలన ప్రతినిధి:హాత్ సే హాత్ జోడో యాత్ర లో భాగంగా మంగళవారం మీనవోలులి గ్రామంలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ కమిటీల తో కలిసి జోడో యాత్ర ప్రారంభించారు . ఇంటింటికీ తిరుగుతూ లిరాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన జోడో యాత్ర గురించి వివరిస్తూ...కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు వెంటనే 2 లక్షలు రుణ మాఫీ,ఇందిరమ్మ ఇంటికి 5 లక్షల ఆర్థిక సహాయం,రైతు పంటకు గిట్టుబాటు ధర,రైతుకు పెట్టుబడికి ఎకరాకు 15000 ఆర్థిక సహాయం,రూ: 500 లకే గ్యాస్ సిలిండర్ఇంకా మరిన్ని పథకాలు ఇస్తుందని ప్రజలకు తెలియజేస్తూ. టిఆర్ఎస్ పార్టీ మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారాన్ని దక్కించుకొని ప్రజల సంక్షేమాన్ని తుంగలో తొక్కారని ,దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని... డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని,రైతు రుణమాఫీ చేస్తామని మోసం చేశారు.అలాగే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా, ప్రభుత్వ అక్రమాలుతో నోటిఫికేషన్లు రద్దు చేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఇకపై మోసపోవద్దని కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుందని,ప్రతి సంక్షేమ పథకాన్ని కాంగ్రెస్ నిర్వర్తిస్తుందని తెలియజేస్తూ ప్రతి ఇంటికి వెళ్ళి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బండారు నరసింహారావు,శీలం శ్రీనివాసరెడ్డి,గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ,పి ఏ సి ఎస్ ఉపాధ్యక్షులు కడియం శ్రీనివాసరావు,షేక్ జానీ భాష నాయకులు అనుమోలు వెంకట కృష్ణారావు,యన్నం పిచ్చిరెడ్డి,దేవరకొండ శ్రీనివాసరావు,కంచర్ల వెంకట నర్సయ్య,సూరంశెట్టి రాజేష్,వేమిరెడ్డి అరవింద్ రెడ్డి,గుడేటి బాబు,నంద్రు జనార్ధన్,దేవరకొండ వెంకటరత్నం, ఉప సర్పంచ్ లు దేవరకొండ అనిల్ కుమార్ నంద్రు వెంకట్రావమ్మ,పార్శపు ప్రసాద్,మారపోగు జమలయ్య,నంద్రు ఆనందరావు,షేక్ ఉద్ధండు సాహెబ్,షేక్ సుభాని,మిద్దె వీరలంక శీలం వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు పివిటీజిలు ఉపయోగించుకోవాలి

**జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**



ఆసిఫాబాద్ జిల్లా జూన్ 13 (ప్రజాపాలన, ప్రతినిధి) : ప్రభుత్వ పథకాలు పివిటీజిలు ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సీఆర్టిలుగా తమకే ప్రాతినిధ్యం కల్పించాలని పివిటీజి ప్రతినిదులతో మాట్లాడుతూ పివిటీజీలకు ప్రభుత్వం ఇస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. సీఆర్టిలుగా పివిటీజీ గ్రూపులకు ప్రాధాన్యత ఇవ్వడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటి,బిర్డు,గోండు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం సంతోష్, ఉపాధ్యక్షులు ఆత్రం శంకర్, గౌరవాధ్యక్షులు దస్రు, వెడ్మ రాము, కన్వీనర్ వెడ్మ తిరుపతి, కోశాధికారి ఆత్రం తిరుపతి, ప్రవీణ్ కుమార్, చందు, పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్ ను కలిసిన మండల బీఆర్ఎస్ నాయకులు



బోనకల్ ,జూన్ 12 ప్రజా పాలన ప్రతినిధి: మండలానికి నూతన తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన చివుగుల రమణిని మంగళవారం మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి పరంగా ప్రజలకు మంచి సేవలను అందించాలని, ప్రజా సమస్యలను అవసరాలకు అనుగుణంగా పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జునరావు, మాజీ మండల అధ్యక్షులు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి బానోత్ కొండ, రావినూతల సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్, మండల రైతు బంధు కన్వీనర్ వేమూరి ప్రసాద్, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నర్మెట మండలంలో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం

జనగాం జిల్లా 13 జూన్ ప్రజాపాలన:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు 2.0 కార్యక్రమం జనవరి 18వ తేదీ న ముఖ్యమంత్రి కె .చంద్రశేఖర్ రావు ఖమ్మం లో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని జనగాం జిల్లా నర్మెట మండల పరిధిలో జనవరి 19వ తేదీన స్థానిక శాసనసభ్యుడు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నర్మెట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు తెజావత్ గోవర్ధన్ ఆద్వర్యంలో ప్రారంభించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని జనవరి 19వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు నర్మెట మండల పరిధిలో అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 17 – గ్రామ పంచాయతీలలో మొత్తం 13001 లబ్దిదారులకు స్క్రీనింగ్ చేశారు. ఇందులో పురుషులు – 6278, స్త్రీలు– 6723 ఉన్నారు. రీడింగ్ గ్లాసెస్ పొందినారు – 1986 ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ ఇప్పటి వరకు 1715 లబ్దిదారులకు అందించడం జరిగిందని అని సంబంధిత మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.కిశోర్ తాల్క తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్ లు ఎంపిటిసిలు కంటి వెలుగు క్యాంపుల నిర్వహణ కోసం సహకరించిన తహసిల్దార్ , మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి మరియు స్థానిక నాయకులకు మండల ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు . క్యాంపు టీం లీడర్ డా.అశోక్ ఝూన్సీ,ఆరోగ్య పర్యవేక్షణాధికారి భాగ్యమ్మ , ఆప్టోమెట్రిస్ట్ కరుణాకర్, డేటా ఆపరేటర్ ముజమ్మిల్, ఎ.ఎన్.ఎం లు, ఆశా వర్కర్లు కు కంటి వెలుగు కార్యక్రమంను విజయవంతం చేసిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో అమరులకు నివాళులర్పించిన బోనకల్ ఎంపిటిసి రమేష్



బోనకల్, జూన్ 13 ప్రజాపాలన ప్రతినిధి:తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ది మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని మధిర స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/ కళాశాల నందు దశాబ్ది దినోత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోనకల్ ఎం.పీ.టీసీ, మండల వైస్ ఎంపీపీ గుగులోత్ రమేష్ జాతీయ జెండాను ఎగరవేసి అమరులకు నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు మానవహారంగా ఏర్పడి తెలంగాణ నినాదాలతో పాఠశాల ఆవరణాన్ని మారుమోగించారు. సందర్భంగా పాఠశాల/ కళాశాల ప్రధానాచార్యులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉందని కాబట్టి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపల్ మహాలక్ష్మి , జూనియర్ వైస్ ప్రిన్సిపల్ షేక్ ఫర్జాన , ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

# అశ్వారావుపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ విజయవంతం



అశ్వారావుపేట ప్రజాపాలన ప్రతి నిధి: అశ్వారావుపేట నియోజవర్గ కేంద్రం అయిన అశ్వారావుపేటలో పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రన్ విజయ వంతమైంది. అశ్వారావుపేటలోని రింగ్ రోడ్డు సెంటర్ లో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తెలంగాణ రన్ ను జెండా ఊపి ప్రారంభించారు. అశ్వరావుపేట నియోజకవర్గ నలుమూలల నుండి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పాత్రికేయులు, విభిన్న వర్గాల ప్రజలు, కార్మికులు, ఆటో యూనియన్స్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా తెలంగాణ రన్ లో పాల్గొన్నారు. పాల్వంచ డిఎస్పి వెంకటేష్, అశ్వారావుపేట సీఐ బొమ్మెర బాలకృష్ణ, ఎస్ఐ రాజేష్ కుమార్, దమ్మపేట ఎస్సై రవికుమార్ లు నేతృత్వం వహించి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన తెలంగాణ రన్ విజయవంతం కై కృషి చేశారు. ఈ తెలంగాణ రన్ అశ్వారావుపేట రింగ్ రోడ్డు సెంటర్ నుండి ఖమ్మం రోడ్ లో స్పైసి రెస్టారెంట్, గవర్నమెంట్ హాస్పిటల్, తహశీల్దార్ కార్యాలయం మీదుగా వ్యవసాయ కళాశాల వరకు నిర్వహించారు. అనంతరం వ్యవసాయ కళాశాలలో ఏర్పాటుచేసిన సభలో డీఎస్పీ వెంకటేష్, సీఐ బొమ్మెర బాలకృష్ణ మాట్లాడుతూ పోలీస్ శాఖ చేస్తున్న సేవలను వివరించారు. కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు విశిష్ట సేవలు అందించిన శాఖ పోలీస్ శాఖ అని, ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజలకు చేరువయ్యామని ప్రజలకు అన్ని రకాలుగా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ పథకాలు ఈ దశాబ్ది వేడుకల్లో భాగంగా ప్రజలకు తెలియజేయాలననే ఉద్దేశంతో ఈ ఉత్సవాలు ప్రారంభించామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా మన తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రన్ ను విజయవంతంగా నిర్వహించినందుకు పోలీస్ శాఖను అభినందించారు. అనంతరం అధికారులు ప్రజాప్రతినిధులతో కలసి శాంతి కపోతాలను ఎగరవేశారు. తెలంగాణ రన్ సందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు కళాశాల ప్లే గ్రౌండ్లో తెలంగాణ మ్యాపు పై విద్యార్థులు కూర్చొని ఏర్పాటుచేసిన తెలంగాణ మ్యాపు చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్ మూర్తి, ఎక్సైజ్ సీఐ నాగయ్య, ఎస్ఐ శ్రీహరి రావు, దమ్మ పేట జడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, రైతుబంధు జిల్లా అధ్యక్షులు రావు జోగేశ్వరరావు, అశ్వారావుపేట తహసీల్దార్ లూథర్ విల్సన్, బండి పుల్లారావు, కాసాని చంద్రమోహన్, యూఎస్ ప్రకాష్ రావు, రాజ మోహన్ రెడ్డి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఎస్కే పాషా, సిపిఎం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, సత్యవరపు సంపూర్ణ, పోలీస్ సిబ్బంది, అశ్వారావుపేట, మండల అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్మికులు, ఆటో యూనియన్ సభ్యులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు,

## ఎల్లమ్మ గుడిలో సర్పంచులకు ఘనంగా సన్మానం

సైదాపూర్/ ప్రజా పాలన ,సైదాపూర్ మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడిలో స్థానిక సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు చందా శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం ప్రధాన కార్యదర్శి కాయిత రాములు ను గౌడ సంఘం ఘనంగా మంగళవారం సన్మానించారు.గత వారం రోజులుగా గౌడ సంఘం అధ్యక్షులు బొమ్మగాని రాజు ఆధ్వర్యంలో ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎల్లమ్మ దేవతను సర్పంచులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గౌడ సంఘం నాయకులు సర్పంచులకు స్వాగతం పలికి సాంప్రదాయ బద్ధంగా తిలకం దిద్ది, కంకణాలు కట్టి ఘనంగా సన్మానించారు. అనంతరం గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ.. స్థానిక ఎల్లమ్మ గుడి వద్ద ఇటీవలే 5 లక్షల రూపాయల సిసి రోడ్డు నిర్మాణం చేసిన సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎల్లమ్మ గుడి ముందు డ్రైనేజీ నిర్మించాలని విజ్ఞప్తి చేయగా వెంటనే స్పందించిన సర్పంచ్ తప్పకుండా నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు అనగోని సదానందం, గోపగోని నవీన్, అనగోని చిన్న వెంకటరాజం, అనగోని పెద్దరాజు ,అనగోని శ్రీనివాస్, పైడిపల్లి నరేష్, ఆకుల రమేష్ ,అనగోని వెంకన్న ,అనగోని వెంకటరాజం, అనగోని సచిన్, అనగోని శ్రీనివాస్( పెట్రోల్ బంక్) అనుగోని తిరుపతి, అనగోని రమేష్ ,గౌడ సంఘం నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంజయ్య మృతి తీరని లోటు.. నివాళులర్పించిన మర్రి నిరంజన్ రెడ్డి





ఇబ్రహింపట్నం జూన్ తేది 13 ప్రజాపాలన ప్రతినిధి:ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండల పరిధి లింగంపల్లి గ్రామానికి చెందిన మైలారం అంజయ్యలి మరణించిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి గారు లింగంపల్లి గ్రామానికిలి విచ్చేసి పార్థివ దేహం పై పూలమాల వేసి, కుటుంబ సభ్యులను ఓదార్చి,10000/- పదివేల రూపాయలు ఆర్థిక సాహాయం అందజేసిన అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు , ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వినోద మూర్తి, వార్డు మెంబర్లు ఐలయ్య, కరుణాకర్, నాయకులు బూర శివ గౌడ్, కిష్టయ్య నాగరాజు,లింగం, కుమార్, ప్రవీణ్, యాదగిరి,నాగరాజ్ గ్రామ ప్రజలు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలు




మేడిపల్లి, జూన్ 13 (ప్రజాపాలన ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రామంతాపూర్ డివిజన్లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పాల్గొన్నారు. మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో దశాబ్ది ఉత్సవాల ఇన్చార్జ్ నోడల్ ఆఫీసర్, ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి, ఎస్.డబ్ల్యూ. డిఈ చందన, ఉప్పల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమాదేవి, వివిధ శాఖల అధికారులు,బిఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, మహిళా సంక్షేమ సంఘాల లబ్ధిదారులు , అంగన్వాడీ సిబ్బంది, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు లక్ష సహాయం చేయటంలో గౌడ కులస్తులను మార్చి పోయిన రాష్ట్ర సర్కార్



ఇబ్రహింపట్నం జూన్ తేది 13 ప్రజాపాలన ప్రతినిధి: మంచాల మండలం అరుట్ల గ్రామంలో గీత కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే కుల వృత్తులు చేసుకొని జీవనం సాగించే కులాలను అన్ని విధాలుగా అదుకుంటాను అని మాయ మాటలు చెప్పిన ముఖ్యమంత్రి కేసిర్ గీత కార్మికులకు ఇప్పట్టి వరకు ఏమి సహాయం చేసాడో ఆర్థికంగా సమాధానం చెప్పాలి గీత కార్మికుడు చని పోతే ఎక్స్ గ్రేషియా తప్ప గీత కార్మికులకు ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయటం లేదు గౌడ కులస్తులు అంటే ప్రభుత్వనికి అంత చులకన గా కనిపిస్తున్నారా గీత కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తాటి చెట్టు ఎంత పెద్దగా ఉన్న ఎక్కి కల్లుఅమ్ముకొని జీవనం సాగిస్తున్నారు రాష్ట్రంలో ఏదో ఒక చోట గీత కార్మికులు తాటి చెట్టు పై నుండి ప్రమాదవశాత్తు జారీ పడి పోయి మరణిస్తున్నారు అయిన ప్రభుత్వం గీత కార్మికుల రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు గతంలో ప్రభుత్వం గీత కార్మికులు కోసం తాటి చెట్టు ఎక్కటానికి యంత్రాలు పంపిణీ చేస్తాం ద్విచక్ర వాహనాలు పంపిణీ చేస్తాం అని గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ గీత కార్మికులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యాడు గీత కార్మికులు చనిపోతే 5లక్షలు ఎక్స్ గ్రేషియా ఇస్తాం అని గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు కొత్తగా అవ్వే5లక్షలకు గీత బంధు పేరు పెట్టి గౌడ కులస్తులను మోసం చేయటం తప్ప వేరే ఏమి లేదు అన్నారు ఆప్కారి మంత్రి శ్రీనివాస్ గౌడ్ గౌడ కులస్తుండు అయ్యి ఉండి కూడా గౌడ కులస్తుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు పోవటం సిగ్గు చేటు గీత కార్మికులకు చని పోతే సహాయం చేయటం కాదు అన్ని బిసి కులాలకు ఎలాంటి పథకాలు అంద చేస్తున్నారో అలానే గౌడ కులస్తులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు పంపిణీ చేయాలి గీత కార్మికులకు తాటి చెట్టు ఎక్కటానికి యంత్రాలు పంపిణీ చేయాలి గీత కార్మికుడి గా గుర్తింపు ఉన్న ప్రతి గీత కార్మికుడికి వయస్సు తో సంబంధం లేకుండా పింఛన్ ఇవ్వాలి గీత కార్మికులు కాసేపు విశ్రాంతి తీసుకోవటానికి తాటి వనాల దగ్గర షెడ్లు నిర్మించాలి ప్రభుత్వం గీత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలోగీత కార్మికులు తాళ్ల. ప్రభాకర్ గౌడ్ సుంకరి.దానయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
గురువారం 15, జూన్ 2023

# తెలంగాణ మహిళ తలెత్తి నిలిచిన దశాబ్దం!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం సంక్షేమ రంగానికి పెద్దపీట వేసింది. ముఖ్యంగా మహిళల అభ్యున్నతి, సాధికారికత ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. మహిళా అభివృద్ధి నిమిత్తం ఆయా శాఖలకు కేటాయించిన నిధులు 2014 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,499కోట్లు ఉండగా, 2023 నాటికి రూ. 2,060కోట్లకు పెరిగాయి. గత దశాబ్దకాలంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సింహావలోకనం చేస్తే ప్రభుత్వం చిత్తశుద్ధి విశదమవుతుంది. ముఖ్యంగా తల్లి కడుపులో ఎదుగుతున్న దశలోనే ఆడపిల్లలకు పౌష్టికాహారాన్ని అందించటం తల్లీబిడ్డల ఆరోగ్యానికి కీలకం. జాతీయ శాంపిల్ సర్వే ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహార లోపంతో శిశు జననాలు అధికంగా ఉన్న జిల్లాలను గుర్తించింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు 'కేసీఆర్ పౌష్టికాహారం కిట్' అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్ల సమన్వయంతో గర్భిణీ స్త్రీలకు రెండు పర్యాయాలు న్యూట్రిషన్ కిట్లను అందజేయడమే కాక వారికి కావాల్సిన వైద్య సదుపాయాలను, మందులను ఉచితంగా అందించింది. రెండు సంవత్సరాల క్రితం నిర్వహించిన జాతీయ శాంపిల్ సర్వే ద్వారా ఈ పథకం సత్ఫలితాలను సాధించిందని, ఆరోగ్యకరమైన శిశువుల జననం జరుగుతున్నదని తెలుస్తున్నది. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రజలు గుర్తించినందున ప్రభుత్వ వైద్యశాలల్లో గర్భిణి స్త్రీల సుఖ ప్రసవాల సంఖ్య పెరిగింది. ప్రభుత్వ వైద్యశాలలో ఆడబిడ్డను ప్రసవిస్తే కేసీఆర్ కిట్ ద్వారా పుట్టిన ఆడ శిశువులకు పన్నెండు వేలు లభిస్తున్నది. ప్రసవం అయిన తల్లికి మరో రూ. 1000 అందుతున్నది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 13,90,639 మంది లబ్ధి పొందారు. దీనికి ప్రభుత్వం రూ. 1261.67కోట్లను ఖర్చు చేసింది. ఆడ శిశువుల జననం తర్వాత ఆరేళ్ళలోపు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేసి వారిని పూర్తి ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం 'ఆరోగ్యలక్ష్మి' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా 35,700 అంగన్వాడీల ద్వారా ఆరేళ్లలోపు చిన్నారులకు, గర్భిణి స్త్రీలకు జాతీయ పౌష్టికాహార సంస్థ నిర్దేశించిన నియమాలకు అనుగుణంగా సంపూర్ణమైన మాంసకృతులు, విటమిన్లు, మినరల్స్‌ను పౌడరు రూపంలో అందిస్తున్నది. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 1,73,85,797 మంది లబ్ధి పొందారు. ఆడ పిల్లలు విద్యారంగంలో ముందుకు రావాలి అనే సంకల్పంతో వారి కోసం ప్రత్యేకమైన గురుకులాలను ప్రభుత్వం స్థాపించింది. సాంఘిక సంక్షేమ గిరిజన శాఖ, వెనుకబడిన %--% మైనారిటి సంక్షేమ శాఖల ద్వారా విద్యార్థినుల చదువుల కోసం బృహత్తరమైన కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తున్నది. రాష్ట్రంలో మహిళలకు సంపూర్ణ రక్షణ అందించాలన్న ధ్యేయంతో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో 'షీ టీమ్స్' వ్యవస్థ ఏర్పాటు చేసింది ప్రభుత్వం. దీని ద్వారా సమాజంలోని అల్లరి మూకల నుంచి స్త్రీలకు పూర్తి స్థాయి రక్షణను అందించగలుగుతున్నది. వివాహిత మహిళలకు కుటుంబంలోని సమస్యలను అధిగమించేందుకు కావలసిన ధైర్య స్థైర్యాలను ఇచ్చి, వారికి తాత్కాలిక ఆవాసం వంటి సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం 'సఖి' సెంటర్లను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్లలో అనేక సమస్యలకు కౌన్సిలింగ్ ద్వారా పరిష్కారం లభిస్తున్నది. వారి ఆర్థిక స్వావలంబన కోసం సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణలు ఇచ్చి, ఆర్థిక సాయం అందచేస్తున్నది. మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కార నిమిత్తం పూర్తి స్థాయిలో రాష్ట్ర మహిళా కమిషన్ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఒంటరి మహిళలను గుర్తించి వారికి ఆసరా పింఛన్లను మంజూరు చేస్తున్నది. ఈ పథకం ద్వారా 1,52,000 ఒంటరి మహిళలు లబ్ధి పొందుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 1430 కోట్లు ఖర్చు చేసింది. భర్తను కోల్పోయిన 15,74,905 మహిళలకు, 4,80,861 మంది మహిళా బీడీ కార్మికులకు ఆసరా పింఛను మంజూరు చేస్తున్నది. వీటి అమలుకు సుమారు రూ. 25,000 కోట్లు ఖర్చు చేస్తున్నది. వృద్ధులకు కూడా ఈ పింఛను సదుపాయాన్ని అందజేస్తున్నది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లో మహిళల వివాహం కోసం ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టింది. దీని ద్వారా వారికి రూ. 1,00,116 ఆర్థిక సహాయం అందచేస్తున్నది. తద్వారా ఆడపిల్లలు పుట్టడం ఒక శాపంగా భావించిన పరిస్థితుల నుంచి వారి జననంతోనే కుటుంబాలలో సంతోషం అనే స్థాయికి సమాజంలో మార్పు వస్తున్నది. ప్రతి ఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలలోని మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నారు. దానికి గాను ఇప్పటి వరకు రూ. 1,536 కోట్లు ఖర్చు చేశారు. రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా టి.హబ్ ద్వారా సుమారు 219 మహిళా పారిశ్రామికవేత్తలు చిన్న, మధ్యతరహా స్టార్టప్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించారు. తద్వారా మహిళలు కూడా పారిశ్రామిక రంగంలో ప్రవేశించి, తోటి మహిళలకు ఉద్యోగ అవకాశాలను పెంచి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడంలో తమవంతు సహాయాన్ని అందిస్తున్నారు. ప్రభుత్వం మార్కెట్ కమిటిలలో 33 శాతం, స్థానిక సంస్థలలో 50 శాతం, ప్రభుత్వ ఉద్యోగాలలో 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించింది. గ్రామీణ స్వయం సహాయక సంఘాల ద్వారా రూ. 7.50 కోట్ల వడ్డీ లేని రుణాలుగా అందచేసింది. అభయ హస్తం ద్వారా రూ. 5.46కోట్లు అందించింది. ఈ విధంగా గత దశాబ్ద కాలంలో మహిళా సాధికారత, స్వావలంబనే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి సఫలీకృతం చెందింది. మహిళాభివృద్ధిలో ఈ దశాబ్దం నేర్పిన అనుభవాలు రానున్న దశాబ్దంలోనూ మహిళా సమస్యల నిర్మూలనలో ఎంతో సహాయపడతాయి.

# మద్దతు కాదు...మోసం..!




ఎం.ఎస్ స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను పక్కన పెట్టి వార్షిక ద్రవ్యోల్బణ ప్రాతిపదికన నామమాత్రంగా పెంచుతున్నారు తప్ప సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకోవటం లేదు. మరోవైపు మార్కెట్లో గోధుమలు, బియ్యం ధరల పెరుగుదల కనీస మద్దతు ధరల కంటే ఎక్కువగా ఉంటున్నది. దీనికి కారణం ఏమిటో ఎవరూ చెప్పరు. ప్రతిదానికీ ఉక్రెయిన్ సంక్షోభం అని చెప్పి తప్పించుకుంటున్నారు. అది ప్రారంభంగాక ముందే మన దేశంలో ధరల పెరుగుదల మొదలైందన్నది చేదు నిజం. ఖరీఫ్ పంటలకు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలు ద్రవ్యోల్బణం తగ్గించేందుకు తోడ్పడతాయని ఆర్థికవేత్తలు స్పందించారు. ఎన్నికల సంవత్సరంలో ధరలు పెరగకుండా, తద్వారా బిజెపికి జనం దూరం కాకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో భాగమే ఇది, రైతులకు మేలు చేసేది కాదని వేరే చెప్పనవసరం లేదు. తమ ప్రభుత్వ హయాంలో 2014-15లో ఏ గ్రేడ్ వరి మద్దతు ధర రూ. 1,400 నుంచి 2023-24లో రూ. 2,203కు అంటే రూ. 803 పెంచినట్లు మోడీ సర్కార్ గొప్పగా చెప్పుకుంటున్నది. సగటున వార్షిక పెంపుదల 5.7 శాతం. అంతకు ముందు కాంగ్రెస్ ఏలుబడిలో 2004-05 రూ. 590 నుంచి రూ. 1,400కు పెరిగింది. రూ. 810 పెరిగింది. సగటు వార్షిక పెరుగుదలలో చూస్తే 14 శాతం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్తి గణనీయంగా సాగు చేస్తారు. కాంగ్రెస్ ఏలుబడిలో పొడవు పింజ పత్తి ధర రూ. 1,760 నుంచి రూ. 4,050 పెరిగింది. నికర పెరుగుదల రూ. 2,290. వార్షిక సగటు 13 శాతం. అదే నరేంద్ర మోడీ కాలంలో రూ. 4050 నుంచి రూ. 7,020కి పెంచారు. నికర పెరుగుదల రూ. 2,970. కాగా వార్షిక సగటు 7.3 శాతమే. ఎవరు రైతులకు మేలు చేసినట్లు? దీని అర్థం కాంగ్రెస్ రైతులను ఏదో ఉద్ధరించిందని చెప్పటం కాదు, పెరిగిన సాగు ఖర్చులతో పోలిస్తే అది కూడా తక్కువే. దానితో పోలిస్తే మంచి రోజులను తెచ్చి అమృత కాలంగా మార్చి రైతుల రాబడి రెట్టింపు చేస్తామన్న నరేంద్ర మోడీ పాలనలో మరింత దిగజారింది అని చెప్పేందుకే ఈ పోలిక. కనీస మద్దతు ధరలను పెంచితే దాని ప్రభావం బియ్యం, వస్త్రాలు-దుస్తుల ధరల పెరుగుదలకు దారి తీస్తుంది కదా అని ఎవరైనా వాదించవచ్చు. రైతులు గొంతెమ్మ కోరికలను కోరటం లేదు. సాగు గిట్టుబాటు కావాలి-వినియోగదారులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉండాలి. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడుల ధరలను స్థిరంగా ఉంచితే రైతులు కూడా మద్దతు ధరల పెంపుదలను అడగరు. అన్నింటికీ మించి ఎవరేమి చెప్పినా రైతు బతకాలి, సాగు సాగాలి. అందుకే కదా రైతుల రాబడిని రెట్టింపు చేస్తామని మోడీ సర్కార్ చెప్పింది. దాన్ని అమలు జరపాలనే కదా రైతులు అడుగుతోంది. ఎన్నికలు జరిగే సంవత్సరంలో ధరలను కాస్త ఎక్కువగా పెంచటం గతంలో కాంగ్రెస్ చేసింది. అదే జిమ్మిక్కు నరేంద్ర మోడీ కూడా కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు 2014-15 నుంచి 2017-18వరకు మూడు సంవత్సరాల్లో ఏ గ్రేడ్ వరికి పెరిగింది మొత్తం రూ. 190 మాత్రమే, సగటున ఏడాదికి రూ. 63 మాత్రమే. అదే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 2018-19లో పెంచిన మొత్తం రూ. 180. తరువాత నాలుగు సంవత్సరాల్లో రూ. 1,770 నుంచి 2022-23 వరకు రూ. 2,060కి అంటే రూ. 290, ఏడాదికి సగటున రూ. 72.50 కాగా వచ్చే ఏడాది ఎన్నికల కారణంగా ఈసారి రూ. 143 పెంచారు. ఎం.ఎస్ స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను పక్కన పెట్టి వార్షిక ద్రవ్యోల్బణ ప్రాతిపదికన నామమాత్రంగా పెంచుతున్నారు తప్ప సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకోవటం లేదు. మరోవైపు మార్కెట్లో గోధుమలు, బియ్యం ధరల పెరుగుదల కనీస మద్దతు ధరల కంటే ఎక్కువగా ఉంటున్నది. దీనికి కారణం ఏమిటో ఎవరూ చెప్పరు. ప్రతిదానికీ ఉక్రెయిన్ సంక్షోభం అని చెప్పి తప్పించుకుంటున్నారు. అది ప్రారంభంగాక ముందే మన దేశంలో ధరల పెరుగుదల మొదలైందన్నది చేదు నిజం. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం పెంచటమే దానికి తిరుగులేని నిదర్శనం. 2021 నవంబరు 19వ తేదీన నరేంద్రమోడీ దేశమంతటికీ క్షమాపణలు చెప్పి మూడు సాగు చట్టాలను వెనక్కు తీసుకున్నట్లు చెప్పారు. వాటిని అమలు జరిపితే రైతుల కష్టాలు తీరుస్తాయన్నారు. వాటిని రద్దు చేసిన తరువాత ఇంతవరకు వాటి బదులు కష్టాలు తీర్చే చర్యలేమీ తీసుకోలేదు. అంటే తాను చెప్పినట్లు వినలేదు గనుక రైతులకు ఒక పాఠం చెప్పాలని మోడీ నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. ప్రజా స్వామ్యానికి నిబద్దులై ఉండేవారి లక్షణం కాదిది. వెంటవెంటనే నిర్ణయాలు తీసుకోవటంలో తమకు తామే సాటి అని చెప్పుకొనే వారు సాగు చట్టాల రద్దు తరువాత ఐదు నెలలకు ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ పరిధి ఏమిటి? ఏ అంశాలను అది పరిశీలిస్తుందో వివరించాలని రైతు ఉద్యమం నడిపిన సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తే సమాధానం లేదు. అందువలన ఆ కమిటీలో ఉండి చేసేదేమీ లేదు గనుక ప్రతినిధుల పేర్లను ప్రతిపాదించటం లేదని స్పష్టం చేసింది. ఈ కమిటీ చైర్మన్ ఎవరంటే రైతులు తిరస్కరించిన మూడు సాగు చట్టాలను రచించిన వ్యవసాయ శాఖ మాజీ కార్యదర్శి సంజరు అగర్వాల్. ఆ చట్టాలను ఎలా రూపొందించాలో సలహా ఇచ్చిన నీతి ఆయోగ్ సభ్యులు రమేష్ చాంద్. కనీస మద్దతు ధరలకు చట్టబద్దత కల్పించకూడదని చెప్పిన ఆర్థికవేత్తలను నిపుణుల పేరుతో చేర్చారు. ప్రభుత్వ ప్రతినిధులు సరేసరి, వీరుగాక రైతుల ఆందోళనను వ్యతిరేకించిన ఐదు సంఘపరివార్ సంఘాలకు చెందిన వారిని చేర్చారు. ఆందోళనకు నాయకత్వం వహించిన వారిని మూడు పేర్లు ఇవ్వాలని కోరారు. నూరు కాకుల్లో ఒక్క కోకిల మాదిరి ఈ ముగ్గురూ ఆ కమిటీలో ఉండి చేసేదేమీ ఉండదు. పోనీ వీరు లేకుండా ఇప్పటి వరకు కమిటీ చేసిందేమిటి అంటే నాలుగు ఉపసంఘాల ఏర్పాటు తప్ప మరేమీ లేదు. కనీస మద్దతు ధరలకు చట్టబద్దత ప్రతిపాదన ప్రస్తావన లేని కమిటీ ఇది. రైతుల రాబడి రెట్టింపుకు మూడు సాగు చట్టాలే ఆక్సిజన్ అని చెప్పారు. ఇంతవరకు వాటి బదులు ఏం చేస్తారో చెప్పలేదు. రైతులను నట్టేట ముంచినట్లేనా! మూడు సాగు చట్టాలను అమలు జరపకుండా 2022 నాటికి రైతుల రాబడిని రెట్టింపు చేయటం కుదరదని నీతి ఆయోగ్ సభ్యులు రమేష్ చాంద్ రైతుల ఆందోళన సమయంలో చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలుకు అవసరమైన మేరకు చర్యలు కూడా తీసుకోలేదని అన్నారు. అసలు రాష్ట్రాలతో సంప్రదించకుండా సాగు చట్టాలను రుద్దారు. నీతిఆయోగ్ సిఫార్సులు చేయటం తప్ప వాటిని కేంద్రమే పట్టించుకోదు. తమ ప్రభుత్వం అమలు జరుపుతున్న స్కీములతో రైతుల రాబడి పెరుగుతున్నదని కేంద్ర ప్రభుత్వం నమ్మించ చూస్తున్నది. 2021లో పార్లమెంటు చర్చల్లో కేంద్ర ప్రభుత్వం ఇవిగో మా పథకాలంటూ 17తో ఒక జాబితాను అందించింది, వాటికి గాను రూ. 17,540 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పింది. 2020-21 సంవత్సరానికి గాను వాటికి కేటాయించిన బడ్జెట్‌లో మూడో వంతు అంటే రూ. 5,787 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వాటిలో మూడు పథకాలకైతే ఒక్క పైసా కూడా ఖర్చు లేదు. అంతే కాదు మొత్తం ఖర్చు చేసినప్పటికీ కేవలం పదిశాతం మంది రైతులకే ఈ పథకాలు అమలు అవుతాయని కూడా కేంద్రమే చెప్పింది. మోడీ సర్కార్ అమలు జరుపుతున్న పిఎం కిసాన్ పథకంలో ఏడాదికి ఆరువేల చొప్పున ఇస్తున్నది కేవలం 10.74 కోట్లు లేదా పది శాతం మంది రైతులకే. అంటే దీని ద్వారా కుటుంబానికి అదనపు రాబడి నెలకు రూ. 500 మాత్రమే. 2022 నాటికి రైతుల రాబడిని రెట్టింపు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవలి కాలంలో ఎక్కడా దాని గురించి మాట్లాడటం లేదు. 2016 ఏప్రిల్‌లో మంత్రులతో ఒక కమిటీని వేశారు. 2018 సెప్టెంబరులో అది ఒక నివేదికను ఇచ్చింది. దానిలో ఏడు అంశాలను పేర్కొన్నారు. 1. పంటల ఉత్పాదకత పెంపుదల, 2. పశువుల ఉత్పాదకత పెంపుదల, 3. వనరులను సమర్థవంతంగా వినియోగించటం-ఉత్పత్తి ఖర్చు తగ్గింపు, 4. పంటల సాంద్రతను పెంచటం, 5. అధిక విలువనిచ్చే పంటల వైపు మళ్లింపు, 6. రైతుల పంటలకు గిట్టుబాటు ధర, 7. అదనంగా ఉన్న మానవ వనరులను వ్యవసాయేతర రంగాలకు మళ్లించటం. వీటిలో ఏ ఒక్క అంశంలోనైనా అప్పటి నుంచి ఇప్పటి వరకు సాధించిన అభివృద్ధి ఏమిటో ఎక్కడా మనకు కనిపించదు. కేంద్రం ప్రభుత్వం జూన్ ఏడున ప్రకటించిన మద్దతు ధరల్లో ఒక్కటంటే ఒక్క పంటకు కూడా స్వామినాథన్ కమిషన్ సూచించిన సి2 ప్లస్ 50 ప్రకారం ధరలను ప్రకటించటం లేదు. అఖిల భారత కిసాన్ సభ వంటి రైతు సంఘాలు కేంద్రం మోసాన్ని ఆధార సహితంగా నిరూపించాయి. ధాన్యానికి క్వింటాలకు రూ. 2183, జొన్నకు రూ. 3180, కందికి రూ. 7000, పత్తికి రూ. 6620 చొప్పున కేంద్రం ఎంఎస్‌పి ప్రకటించింది. కానీ సి2 ప్లస్ 50 పర్సెంట్ ప్రకారం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2866.5, జొన్నకు రూ. 2833, కందికి రూ. 8989.5, పత్తికి రూ. 8679 ప్రకటించాలి. ఆ మేరకు రైతులు నష్టపోతున్నారు. రైతు వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సిఎసిపి) అంచనాల కంటే ఆంధ్రప్రదేశ్, బీహార్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి చోట్ల పెట్టుబడులు అధికంగా ఉంటున్నాయి. జాతీయ సగటు కంటే అధికంగా ఎంఎస్‌పి ఇచ్చామంటున్నారు. ఎక్కువ ఖర్చు ఉన్న చోట రైతుల నష్టాన్ని ఎవరు భరించాలి? సాగు ఖర్చులో, రైతుల రాబడిలో ఒక రాష్ట్రానికి ఒక రాష్ట్రంతో పొసగదు. అందువలన సగటు లెక్క అనేది అశాస్త్రీయం. కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక విధానాలను అమలు జరుపుతున్నట్లే సాగు ఖర్చు ఎక్కువగా ఉన్న చోట రైతును ఆ మేరకు ఆదుకోవాలి.

# విభ్రమ



పచ్చిబద్దల్లా పగిలిన పాదాలు
నల్లటి నలుపు
మరింకేం పోలిక అక్కర్లేదు
త్రీడీలో చూసినట్టు ఉబ్బిన ముఖాలు
భుజాల మీద వేళ్లాడుతూ
చర్మాన్ని చుట్టుకున్న శబ్దాల
చందమామలు

ఆ రసధ్వని వెనక ఉనికి మహాసముద్రం
సలవాద్రి గొంతులో పలికిన
దు:ఖపు వెలివేతల జీర కలిసిపోయిన
నిష్కల్మష సంగీతం ఎందుకు నన్ను
ముంచెత్తుతుంది!
ఆగిపోయిన ఊపిరిని
మళ్ళీ మళ్ళీ పోసి ఆశలు పూయిస్తుంది
అది మోహమూ కాదుబీ మాయా కాదు
నా పితరుల ముందు నిల్చోబెట్టేందుకు
నన్ను గతానికి మోసుకెళ్లే కలల పడవ

బిర్ర బిగుసుకున్న చర్మపు పలక మీద
చీకటిలో మునిగిన చేతులు
చిర్రా చిటికెనపుల్ల తగిలించగానే
సూర్య కిరణాలన్నీ నిప్పురవ్వలై
చిందిపడినట్టు
మెరుపొచ్చి కరచాలనం చేసినట్టు
ఊహించని తత్తరపాటు
ఒళ్ళు ఒళ్ళంతా నిట్ట నిలువునా నిలబడి
నాగుబామై ఆడుతుంది!

ఆ హౌరు చెవులకి తాకుతుంటే
భౌతికాభౌతికాల మజ్జన వేలాడుతూ
ఆకాశపు అంచుమీద నుంచి ఈ
ప్రపంచాన్ని చూస్తావు
ముఖంలో రంగులు మారిపోతూ
మారిపోతూ
నీలోకి నీ తాతో ముత్తాతో వచ్చి
ఆవహిస్తారు
మాటల్లేని తనంలో
మట్టి మీద పొర్లాడుతూ మహదానందం
పొందుతావు

ఇది సంప్రదాయానికి ఆవల జరిగే ఉత్సవం
నొసలు చిట్లించే ముఖాలకి అర్థంకాని
ఆనంద పరమావధి
మన్నుని మనసారా కౌగలించుకునే
మహద్భాగ్యం!

చావైనా , సంబరమైనా
మోత సాగే కొద్దీ
గుండెల్లో ఎక్కడో నరాల్ని చీల్చుకుని
గొంతుముడిలో చిక్కుబడ్డ పాటల
ముందటి సాకీ గుర్తుకుతెస్తుంది
ఎక్కడ ఆ చప్పుడు విన్నా
విలాప వాక్యాలన్నీ
వీపు మీదనే పలికించుకున్న
ప్రవక్తల రోదనలా వినబడుతున్నా
మళ్ళీ మళ్ళీ హత్తుకోవాలనిపిస్తుంది
నన్ను నేను దొరకబుచ్చుకుని
చిందు తొక్కాలనిపిస్తుంది !

– అనిల్ డ్యాని

# గంథం ఫౌండేషన్ ద్వార విదేశీ ప్రయాణానికి ఆర్థిక సహాయం



మేడిపల్లి, జూన్ 13 (ప్రజాపాలన ప్రతినిధి) :రామంతాపూర్ డివిజన్ నేహ్రూనగర్ కు చెందిన నిఖిల్ కుమార్ తండ్రి వేంకటేశ్వర్లు నిరుపేద కుటుంబం.నిఖిల్ తండ్రి పెయింటర్ గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన కుమారునికి ఆస్ట్రేలియాలో వరల్డ్ పేపర్ ప్రెసెంటేషన్ కు సెలెక్ట్ అయిందు. విదేశీ ప్రయాణానికి (విమాన ఛార్జీలకు) ఆర్థికంగా ఇబ్బంది ఉండటంతో సహాయం కొరకు గంథం నాగేశ్వరావును కలవగా తక్షణమే స్పందించి రూ 15 వేల చెక్కును విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భముగా గంథం నాగేశ్వరావు మాట్లాడుతూ గంథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథలకు,వికలాంగులకు ,నిరుపేద కుటుంబీకులకు ,నిరుపేద విద్యార్థులకు,అకాల మృతి చెందినవారికి సహాయం అందిస్తున్నామని తెలిపారు.

## మహ సత్సంగం కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ చేతన హరీష్



మేడిపల్లి, జూన్13 (ప్రజాపాలన ప్రతినిధి) : రామంతాపూర్ శుభం గార్డెన్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ జీ అశీస్సులతో స్వామి సూర్యపాదజీ నిర్వహించిన మహ సత్సంగం కార్యక్రమంలో హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి సూర్యపాదజీ చక్కటి ఉపదేశాలను అందించారు. మన దైనందిన జీవితంలో యోగా, ధ్యానం మరియు ఇతర మంచి అలవాట్లను అలవాటు చేసుకుంటే ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని, దీని ఫలితంగా హింస లేకుండా శాంతియుత ,ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది, తద్వారా మన నగరం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పంట పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు తొలగించాలి



మధిర రూరల్ జూన్ 13 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో నక్కలగరువు బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో పొలాల్లో ప్రమాదం పరంగా విద్యుత్ తీగలు ఉంటూ పొలాల్లో విద్యుత్తును పోల్స్ ను సరిచేయాలని విద్యుత్ అధికారులకు రైతుల వేడుకోలు నక్కలగరుబులో పంట భూముల్లో 3 ఫేస్ కరెంట్ తీగలు ప్రమాదకరంగా మారాయి.రైతు వీరంశెట్టి కృష్ణారావుకి చెందిన సర్వే నెంబర్ 47,48 పొలంలో కరెంట్ తీగలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి.రైతు పొలంలో ట్రాక్టర్ తో దుక్కులు దున్ను కోవాలంటే బయపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గతంలో విద్యుత్ అధికారులకు చెప్పినా సమస్య పరిష్కరించలేదని వాపోతున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని అధికారులను వేడుకుంటున్నాడు.

## గ్రామ సర్పంచ్ విజయశాంతి దంపతులకు పెళ్ళిరోజు శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు



మధిర రూరల్ జోన్ 13 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో దెందుకూరు అభివృద్ధి దాత ప్రజల మనసుల్లో మహారాజుగా నేను సైతం అంటూ అందరికీ అభిమానిగా గ్రామం సర్పంచ్ సహకార సంఘం అధ్యక్షులు కోట వెంకటకృష్ణ విజయశాంతి దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు ప్రజలు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూసీతారాముల లాంటి మీ జంట భావితరాలకు ఆదర్శవంతంగానూ, నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఆరోగ్యవంతమైన జీవితం ప్రసాదించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ ఇకముందు కూడా దెందుకూరు గ్రామ అభివృద్ధిలో మీ పాత్ర కొనసాగిస్తారని ఆశిస్తూ మీకు మరొక మారు హృదయపూర్వకవివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ వారు ఇలాంటి పెళ్లి రోజులు ఎన్నో జరుపుకోవాలని వారికి శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు

# రాష్ట్ర అవతరణ మహిళా సంక్షేమ దినోత్సవం వేడుకలు



మధిర జూన్ 13 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మహిళ సంక్షేమ దినోత్సవ సందర్భంగా స్థానిక రెడ్డి గార్డెన్లో ఏర్పాటుచేసిన దశాబ్ది ఉత్సవాలలో అంగరంగ వైభవంగా జరిగిన మహిళా సంక్షేమ దినోత్సవం ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొని మహిళ సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలందరికీ ధన్యవాదాలు శు భాకాంక్షలు తెలుపుతూ. తెలంగాణ ప్రభుత్వం రాకముందు అంగన్వాడి కార్యకర్త అని పిలిచేవారు తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంగన్వాడీ టీచర్ అని పిలుస్తున్నారు. కెసిఆర్ సీఎం కాకముందు 400 రూపాయలు అంగన్వాడీ కార్యకర్త జీతం, 200 రూపాయలు ఆయాకి జీతంగా ఉండేది. ఇప్పుడు అంగన్వాడి టీచర్లకు పదివేలు ఆయాకు 7500 రూపాయలు ఇచ్చిన ఘనత కెసిఆర్ది. గ్రామదీపిక వేతనం తెలంగాణ ప్రభుత్వం రాకమందు 500 రూపాయలు, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఇచ్చేది 3500 రూపాయలు. మన సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ధర్నాలు, ఆందోళనలతో పని లేకుండా మన అంగన్వాడి టీచర్లకు వేతనాలు మూడు రెట్లు పెంచడం జరిగింది. మహిళలు గర్భిణీ దాల్చిన దగ్గర నుండి డెలివరీ అయ్యేవరకు తెలంగాణ ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది.గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే తెలంగాణ ప్రభుత్వ హయాంలో ధైర్యంగా వెళు తున్నారు. అన్ని రంగాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు బాసటగా నిలుస్తుంది. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే ఆనందంగా వెళుతున్నాం. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్, పథకల ద్వారా లక్ష 116 రూపాయలు తెలంగాణ ప్రభుత్వం అందిస్తుంది. ఐకెపి సంఘం మహిళలతో ధాన్యం కొనుగోల కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్న.తెలంగాణ ప్రభుత్వంలోనే మహిళా సాధికారిత సాధించాం అనంతరం మహిళా దినోత్సవ సందర్భంగాఉత్తమ పారిశ్రామికవేత్తగా ఎదిగిన జయలక్ష్మిని ఘనంగా సన్మానించిన జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ఉత్తమ సంఘ సేవకులుగా అవార్డు పొందిన బోనకల్ శాంతి నిలయం వ్యవస్థాపకులు సిస్టర్ ఆల్ఫీఉత్తమ అంగన్వాడి టీచర్ గా అవార్డు అందుకున్న మధిర మినీ అంగన్వాడీ టీచర్ ప్రశాంతి సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్ స్థానిక ఎమ్మార్వో కృష్ణ ఎంపీడీవో ఎంపీపీ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ విద్యాలత మొండితోకలత ఎం లలిత వార్డు కౌన్సిలర్ మాధవి లక్ష్మి కళ్యాణి అప్పారావు జీ రామారావు మున్సిపల్ కమిషనర్ రమాదేవి పలు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## శ్రీతాత జగన్మోహన రావు పార్థివ దేహానికి నివాళులర్పించిన పలువురు ఆర్యవైశ్య నాయకులు



మధిర రూరల్ జోన్ 13 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో పలువురు ప్రజాప్రతినిధులు ఆర్యవైశ్యులు జగన్మోహన్ రావు మూర్తి పట్లఆర్యవైశ్యులు వ్యాపారవేత్త తాత జగన్ మోహన్ రావు మృతి పట్ల మధిర కౌన్సిలర్ కట్ట గాంధీ మాట్లాడుతూ మంచి మనిషిని కోల్పోయామని వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తూ నివాళులర్పించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు ఇరుకుళ్ళ లక్ష్మీ నరసింహరావు, బంజారా కాలనీ వెంటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ గుండెల ముత్తయ్య, మధిర సొసైటీ మాజీ చైర్మన్ రంగా అప్పారావు మాట్లాడుతూ ఒక మంచి మనిషి కోల్పోయామని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగా హనుమంతరావు, నాళ్ళ శ్రీనివాసరావు (వాణి ట్రేడర్స్) , పల్లపోతు ప్రసాదరావు, చిన్నం శ్రీనివాసరావు, కొల్లా శ్రీనివాసరావు, కొల్లా రామకృష్ణ, కోట రంగారావు, కోట కృష్ణ, సముద్రాల పురుషోత్తం, ఖరీదు రమేష్ కాంగ్రెస్ నాయకులు మండలాధ్యక్షుడు కిషోర్ రంగా హనుమంతరావు మిర్యాల రమణగుప్త బాలరాజు వాసు టిఆర్ఎస్ నాయకులు మండితోక సుధాకర్ బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## టిడిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే దయాకర్ రెడ్డికి మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటించిన టిడిపి నాయకులు



మధిర జూన్ 13 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో టీడీపీ కార్యాలయంలో మధిర టౌన్ మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు అధ్యక్షత ననేడు నిర్వహించిన సంతాప సమావేశంలో జాతీయ తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే దయాకర్ రెడ్డిగారి మృతికి వారి చిత్ర పటానికి శ్రద్ధాంఅంజలి ఘటించి నివాళులు తెలిపి సంతాపం ప్రకటించిన టిటిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఈరోజు ఉదయం హైదరాబాద్ లో అనారోగ్యంతో కన్నుమూసిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు, మూడుసార్లు తెలుగుదేశం శాసనసభ్యునిగా గెలిచిన మక్తల్ మాజీ శాసనసభ్యుడు కొత్తకోట దయాకర్ రెడ్డి కి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మధిర నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు. ఈ రోజు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మల్లాది హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సంతాప సమావేశంలో డా.రామనాథం మాట్లాడుతూ మంచికి మారుపేరు ప్రజల మనిషి,1994, 1999 సం.లో అమరచింత నియోజకవర్గం నుండి, 2009 లో మక్తల్ నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా గెలుపొందారని, అంతేగాక తెలుగుదేశం పార్టీకి ప్రధాన కార్యదర్శిగా కూడా తన సేవలందించారని కొనియాడారు. స్వర్గీయ దయాకర్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, మాజీ శాసన సభ్యురాలైన దయాకర్ రెడ్డి సతీమణి శ్రీమతి సీతా దయాకర్ రెడ్డి కి ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. మధిర మున్సిపాలిటీ కౌన్సిలర్ వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, పట్టణ పార్టీ కార్యదర్శి చెరుకూరి కృష్ణారావు, నాయకులు, వేమూరి సునీల్, మేడా వెంకటేశ్వరరావు, వీరమాచినేని అశోక్, సాయి, రాయప్ప తదితరులు పాల్గొని దివంగత కొత్తకోట దయాకర్ రెడ్డి కి నివాళులర్పించారు

# నేడు మెగా రక్తదాన శిబిరం



మంచిర్యాల టౌన్, జూన్ 13, ప్రజాపాలన : ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల జిల్లా శాఖ ఆద్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో మెగా రక్తదాన శిభిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాతలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ రక్త దాన శిభిరాన్ని విజయవంతం చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల జిల్లా ఛైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో విలేకరుల తో మాట్లాడారు. ఈ మధ్య కాలంలో జిల్లా పాలనాధికారి అధ్యక్షతన అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్త దానం చేసి ఆపదలో ఉన్న రోగులకు ప్రాణదానం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఛైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి వైస్ ఛైర్మన్ చెందూరి మహేంధర్, జిల్లా కోశాధికారి పడాల రవీంధర్ , కమిటి సభ్యులు వి మధుసూదన్ రెడ్డి , కాసర్ల శ్రీనివాస్ , కె సత్య పాల్ రెడ్డి, కిషన్, నాగేంధర్ , రక్తనిధి వైద్యులు డా. వంశి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర దశాబ్ది దినోత్సవ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు ప్రత్యేక పూజలు



ఎర్రుపాలెం జూన్ 13 ప్రజాపాలన ప్రతినిధి:తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ,కమిషనర్ దేవాదాయ ధర్మదాయ శాఖ హైదరాబాద్ వారి ఉత్తర్వులను అనుసరించి మంగళవారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం జమలాపురం నందు స్వామివారికి ప్రత్యేక పూజలు, ఉచిత అన్న ప్రసాద వినియోగము నిర్వహించడం జరిగినది. మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా మధ్యాహ్నం 3-00 గంటలకు దేవాలయంలో పనిచేస్తున్న మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కొత్తూరు జగన్మోహన్ రావు , ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ, వేద పండితులు, ఆలయ ముఖ్య అర్చకులు ఉప్పల విజయ దేవశర్మ, ఉప్పల సుదర్శనశాస్త్రి, అర్చకులు రాజీవ్ శర్మ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కే.విజయ కుమారి, జూనియర్ అసిస్టెంట్ మరియు అర్చకులు,సిబ్బంది, భక్తులు, జమలాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సీనియర్ జర్నలిస్టు మక్కేన నాగేశ్వరావు జన్మదిన వేడుకలు



మధిర జూన్ 13 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాడు ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ మక్కెన నాగేశ్వరావు జన్మదిన వేడుకలు పలువురు జర్నలిస్టుల వాకర్స్ మధ్య ఘనంగా జన్మదిన వేడుకలుముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్సీనియర్ జర్నలిస్టులు వాకర్స్ కలిసి సీనియర్ జర్నలిస్ట్ మకర నాగేశ్వరావు జన్మదిన వేడుకలు టీవీఎం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టుగా నాగేశ్వరావు జన్మదిన వేడుకలు చేసుకోవడం శుభదినంగా వారు నిండు నూరేళ్లు ఆరోగ్యంతో ఆయుష్ తో ఉండాలని ఇలాంటి జన్మదిన వేడుక ఎన్నో జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నాను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు విశ్వనాథం పలువురు జర్నలిస్టులు మిత్రులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో మహిళలు మహారాణులు..:ఎమ్మెల్యే కిషన్ రెడ్డి





ఇబ్రహింపట్నం జూన్ తేది 13 ప్రజాపాలన ప్రతినిధి :తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ రోజు మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మన్నెగూడ జేఎంఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన మహిళా సంక్షేమ ఉత్సవాలులో ఎమ్మెల్యే లిమంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ని మహిళలు ఘనంగా స్వాగతం పలికారు.జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ద్వారా పొందుతున్న పథకాలు(ఆరోగ్య లక్ష్మీ, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, ఆసరా పింఛను, కళ్యాణ లక్ష్మీ మొదలైనవి) గురించి వివరించి సభాముఖంగా ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు.

**ఎమ్మెల్యే మంచిరెడ్డి రెడ్డి మాట్లాడుతూ...**

దేశంలోనే కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనా తెలంగాణ మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి ముందుండడంలోరోల్ మోడల్ గా నిలిచిందని, గత 9సంవత్సరాల ప్రయాణంలో ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారి దార్శనిక నాయకత్వంలో రాష్ట్రంలో అనేక పథకాలు మహిళా సంక్షేమం కోసం అమలు చేయడం ద్వారా సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే మార్గదర్శకంగా నిలిచిందని ఆన్నారు. అనంతరం 22,29,00,000/- రూపాయల విలువచేసిన బ్యాంకు లింకేజీ చెక్కును స్వయం సహాయక సంఘాలకు, కేసీఆర్ కిట్లు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు మొదలైనవి లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో విషాదం

## కాలేజీ క్యాంపస్‌లో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య



మంచిర్యాల బ్యూరో, (బాసర ), జూన్ 13, ప్రజాపాలన: తెలంగాణలో విద్యాసంస్థలు ఓపెన్ చేసి రెండ్రోజులు కూడా కాలేదు. అప్పుడే రెండు విషాదకర ఘటనలో చోటు చేసుకున్నాయి. మంగళవారం ఉదయం నారాయణ జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్యార్థి బిల్డింగ్ ఐదో అంతస్తు నుంచి దూకి ప్రాణాలు విడవగా.. తాజాగా.. నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో మరో విద్యా దీపికా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. క్యాంపస్‌లో పీయూసీ రెండో ఏడాది చదువుతున్న దీపిక (19) అనే విద్యార్థిని హాస్టల్ బాత్‌రూంలో ఆమె చున్నీ తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.. స్థానిక విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం...సంగారెడ్డి జిల్లా వడ్లపల్లి మండలం గొర్రెపల్లి కి చెందిన దీపికా (19) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం బాత్‌రూంకి వెళ్లిన దీపిక ఎంతసేపటికీ బయటకు రాకపోవటంతో భద్రతా సిబ్బంది డోరు పగలగొట్టి చూడగా.. ఆమె కిటికీకి ఉరేసుకొని కన్పించింది. వెంటనే ఆమె ను బైంసా ఆసుపత్రికి తరలించారు. ఐతే అప్పటికే ఆమె మృతి చెదింనట్లు వైద్యులు ప్రకటించారు. అనంతరం బాడీని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె మృతికి కారణాలు తెలియరాలేదు. చదువుల వల్ల మానసిక ఒత్తిడా ? లేక మరదైనా కారణమా ? తెలియాల్సి ఉంది. విద్యార్థిని మృతిపై కేసు నమోదు చేసకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

**బిల్డింగ్‌పై నుంచి దూకి..**

మేడ్చల్ జిల్లా బాచుపల్లి నారాయణ కాలేజీలోనూ ఓ విద్యార్థి మంగళవారం చనిపోయింది. కళాశాల భవనం పైనుంచి దూకి ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న రాగుల వంశిత అనే విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. మృతురాలిది కామరెడ్డి కాగా.. వారం రోజుల క్రితమే ఆమె తల్లిదండ్రులు కాలేజీలో చేర్పించి వెళ్లారు. అప్పటి నుంచి కాలేజీ క్యాంపస్‌లోనే ఉంటున్న వంశిత.. మంగళవారం ఉదయం కాలేజీ ఐదో అంతస్తు నుంచి దూకి చనిపోయింది. గమనించిన కాలేజీ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించారు. కాలేజీ ప్రాంగణానికి చేరుకున్న పోలీసులు.. విద్యార్థిని మృతిపై ఆరా తీశారు. వంశిత బిల్డింగ్ పైనుంచి దూకిందా ? లేక ఆమెను ఎవరైనా తోసేశారా ? అన్న కోణంలో విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి మృతి ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. విచారణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు జారీ చేయాలి: కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి





మేడిపల్లి, జూన్13 (ప్రజాపాలన ప్రతినిధి) :అర్హులైన పేద ప్రజలందరికీ రేషన్ కార్డులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జారీ చేయాలని కోరుతూ ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వందలాది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ఎత్తున ర్యాలీగా ఉప్పల్ సివిల్ సప్లై ఆఫీస్ వరకు చేపట్టి రేషన్ కార్డులను వెంటనే జారీ చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పాలకుల మొద్దు నిద్రను వదిలిద్దాం.. కాంగ్రెస్ సారధ్యంలో రేషన్ కార్డులను సాధిద్దాం. రేషన్ కార్డు పేదోడి హక్కు. ఆహార భద్రత కార్డు పేదోడీ ధైర్యం.. పేదోడీ హక్కును, ధైర్యాన్ని కేసీఆర్ ప్రభుత్వం కాలరాసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్న ఈ మాయ ప్రభుత్వం సామాన్యుడి గురించి మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వని పాడు ప్రభుత్వం ఇది అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పథకాలు ప్రతి పేదోడికి అందేవని,ఆరు నెలకు ఓసారి తెల్ల రేషన్ కార్డులు ఇస్తూ తెల్ల రేషన్ కార్డు పై ఆరోగ్యశ్రీ సేవలను ఉచితంగా అందించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వంమే అన్నారు. ఈ రేషన్ కార్డు పై 9 రకాల సబ్సిడీలు ఉచితంగా అందించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన తెలియజేశారు. ప్రతిసారి ఎలక్షన్లు వచ్చిన తరుణంలో ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త పథకాలు తీసుకొచ్చి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేయడం అలవాటైపోయింది అన్నారు. నియోజకవర్గ స్థాయిలో 30 వేలకు పైగా దరఖాస్తులు ఉన్నా కానీ ఏ ఒక్కరికి ఇప్పటివరకు రేషన్ కార్డు అందించిన దాఖలాలు లేవు, కావున ఇకనైనా ప్రజలు బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని మట్టికరిపించి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని రాగిడి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు మేకల శివారెడ్డి, టిపిసిసి మైనార్టీస్ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రెటరీ సంజయ్ జైన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పత్తి కుమార్, నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మేడల మల్లికార్జున గౌడ్, రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహ్మద్ రఫీక్, హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాలేరుజే నవీన్, హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ సుధాకర్ రెడ్డి, మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ వంగేటి సంజీవరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధాకర్ శెట్టి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మైనారిటీస్ చైర్మన్ అబ్దుల్ రషీద్ ఆశు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ గణేష్ నాయక్, టిపిసిసి మైనార్టీస్ జనరల్ సెక్రటరీ షేక్ ఖాదర్ వలీ,నెమలి అనిల్, టిపిసిసి మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ జమీల బేగం, నీరజారెడ్డి, మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, ఎయిమ్స్ చైర్మన్ షబ్బీర్ అలీ, భాను గౌడ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రెటరీ సాయిబాబా, బూర్గుల రమేష్ గౌడ్,ఉప్పల్ అసెంబ్లీ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ రమేష్ నాయక్,టిపిసిసి ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ మాలు నాయక్, హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కిషన్ నాయక్, ఉప్పల్ ఎస్టి సెల్ చైర్మన్ హెచ్ఆర్ మోహన్, రాష్ట్ర సేవాదళ్ నాయకులు సద్గుణ రావు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్సీ సెల్ అడ్వైజర్ పిజి సుదర్శన్, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ సాయి గౌడ్, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కె. రాజేష్, బాలరాజు గౌడ్, రిజ్వాన్, ముజీబ్,సందీప్ గౌడ్ మురళీకృష్ణ ముదిరాజ్, వీరేందర్, సాల్మన్, చందు యాదవ్, మల్లేష్ యాదవ్, కడమంచి వెంకటేష్, నవీన్, శ్యాంసుందర్, చర్లపల్లి డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్, పెద్దిరెడ్డి, హిరాలాల్ నాయక్,మల్లాపూర్ డివిజన్ ఎస్టీ సెల్ అధ్యక్షులు మహేష్ నాయక్, మల్లాపూర్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులుమనోహర్, ఉప్పల్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ నరేష్, మల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రావణ్ కుమార్, నిమ్మ సురేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,సీనియర్ నాయకులు భద్రయ్య, ఉప్పల్ నియోజకవర్గం బి బ్లాక్ మైనార్టీస్ వైస్ చైర్మన్ జహీరుద్దీన్, ఉప్పల్ డివిజన్ మైనారిటీస్ చైర్మన్ గజ్జల రాజు, రాఘవ, ఖయ్యూం, గొల్లూరి ప్రభాకర్, బిక్షపతి,సాయి సాదినేని, పుల్ల ప్రశాంత్, రాకేష్, యూసఫ్, సాయి రెడ్డి, జగన్, ఇమ్రోస్, వి. వెంకటేష్ గౌడ్, సి. వెంకటేష్ గౌడ్, మహేష్ గౌడ్, శ్రీశైలం గౌడ్, సంతోష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాకేష్, మహిళ నాయకురాలు రమ రెడ్డి,లీలావతి,సుజాత నాయక్, లక్ష్మి, శివలక్ష్మి, గొల్లూరి సులోచన, పవన్ సన్నీ గౌడ్ అజయ్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలు



మేడిపల్లి, జూన్13 (ప్రజాపాలన ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పీర్జాదిగుడా మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని శ్రీ పలని కన్వెన్షన్ లో ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహిళా మణులకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు.దేశంలో మహిళల కోసం అత్యధికంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేశంలో అత్యధిక వేతనాలు కూడా మనం అంగన్వాడీలకే అందుతున్నాయని మేయర్ జక్క వెంకట్ రెడ్డి తెలిపారు. అనంతరం 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ స్త్రీ ఎక్కడ గౌరవించబడుతుందో అక్కడ దేవతలు ఉంటారని దాని భావం. తల్లిగా,చెల్లిగా, భార్యగా మన బాగోగులు చూడటంతో పాటు నేటి ఆధునిక మహిళలు పురుషులతో సమానంగా ఉద్యోగాలు చేస్తూ కుటుంబ భారాన్ని సగబాగం పంచుకొని ఆకాశంలో సగం, అవకాశాల్లో సగమని సగర్వంగా చాటి చెప్తున్నారని అన్నారు. ఈ మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమనికి 25వ డివిజన్ నుండి 80 మంది మహిళ సోదరీమణులు పాల్గొని కార్యక్రరమాన్ని విజయవంతం చేసిన అందరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా, మహిళా సంక్షేమ దినోత్సవం వేడుకలు: జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే





ఆసిఫాబాద్ జిల్లా జూన్ 13 (ప్రజాపాలన, ప్రతినిధి) : రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్ లో బోర్కడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతనలో మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవం వేడుకలను, జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పిటిసి నాగేశ్వర్ రావు లతో కలిసి, ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పి చైర్ పర్సన్ కోవ లక్ష్మీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నారీ మణులకు పెద్దపీట వేశారని అన్నారు. ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు, వితద్దులకు, పింఛన్లు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకుంటూభరోసా ఇచ్చారు. ఆడ పిల్లల వివాహాలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పథకం ద్వారా రూపాయలు 1లక్ష 116 లు ఇస్తూ వారి కుటుంబానికి అండగా నిలుస్తుంది అన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా 33 శాతం రిజర్వేషన్ రాష్ట్రంలో అమలు చేయడంతో రాజకీయంగాను ఉద్యోగాలలోనూ మహిళలు రాణిస్తున్నారని అన్నారు. యువతులు మహిళల కోసం రక్షణ కోసం షీ టీమ్స్, సఖి సెంటర్ లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నాగేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్, గాదే వేణి మల్లేష్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, గిరిజన సంక్షేమ డిడి మణెమ్మ, మహిళా శిశు సంక్షేమ అధికారి సావిత్రి, అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కార్పొరేటర్ శ్రీవాణి జెడ్సీకి వినతి




మేడిపల్లి, జూన్13 (ప్రజాపాలన ప్రతినిధి): రామంతాపూర్ డివిజన్లో పలు అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రం అందజేశారు. డివిజన్లోని భరత్ నగర్, శాంతి నగర్, ఇందిరా నగర్, నెహ్రూ నగర్, వివేక్ నగర్ లలో బాక్స్ డ్రైన్, కామాక్షిపురం, భరత్ నగర్లో సీసీ రోడ్ గురుంచి వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. జోనల్ కమిషనర్ స్పందిస్తూ పనులు వెంటనే చెపడుతామని తెలిపినట్లు కార్పొరేటర్ తెలిపారు.

## భూమిని ఇప్పించండి: ప్రభుత్వానికి న్యాయవాది జిలానీ విజ్ఞప్తి




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రైవేట్ వ్యక్తికి చెందిన భూమిని నిరుపేదలకు ఇప్పించాలని న్యాయవాది జిలాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరూర్నగర్ మండలం మన్సూరాబాద్ గ్రామం సర్వేనెంబర్ 7లో అనిఫా బి పేరిట ఉన్న భూమిపై 2010 నుంచి న్యాయ పోరాటం చేస్తున్నామని చెప్పారు. అనిఫా బి కోరిక మేరకు ఆమె మనవడు యూసఫ్ ఖాన్ పేదలకు పంచేందుకు సిద్ధంగా ఉండడంతో వారందరి తరపున కోర్టుకు విన్నవించగా, భూమిని పేదలకు అందించేందుకు సహకరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. వికలాంగులు, కడు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్న వారికి భూమిని పంచుతామని ప్రభుత్వానికి పలుమార్లు మొరపెట్టుకున్న ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూమిని ఇప్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇజదాని, సునీల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆరోగ్యవంతులవుతున్నారు




తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి మహిళలు ఆరోగ్యపరంగా ఆరోగ్యవంతులవుతున్నారని అనేక సంక్షేమ పథకాలు అనేక సంక్షేమ పథకాలు అందుకుంటున్నారని ఆరోగ్యలక్ష్మి కార్యక్రమం విజయవంతం అవుతుందని శాసనసభ్యులు పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. తాండూర్ తులసి గార్డెన్లో లో జరిగిన మహిళ సంక్షేమ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అంగన్వాడి కార్యక్రమాలు ద్వారా ఆరోగ్యంగా ఉండడానికి మందులు పోషకాలు అందిస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఆశ వర్కర్లు అంగన్వాడీ వర్కర్ల వేతనాలు భారీగా పెంచడం జరిగిందని తెలిపారు తెలంగాణ వచ్చిన తర్వాత కాలంలో మహిళలు అనేక రంగాల్లో డబ్బులు చెందారని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక్ కుమార్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజు గౌడ్ త్వరలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దబీరవల్లీ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ ఎన్నిక

**పార్టీ ప్రధాన కార్యదర్శిగా గండమాల రామరావు ఎన్నిక**



బోనకల్, జూన్ 13:గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయడానికి నూతన కమిటీలు కష్టపడి పనిచేయాలని టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని పెద్దబీరవల్లి గ్రామంలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాలి దుర్గారావు,జెడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబు,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామ కోటేశ్వరరావు ల ఆద్వర్యంలో కాంగ్రెస్ నూతన గ్రామ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శిగా గండమాల రామరావు,గ్రామశాఖ అధ్యక్షుడిగా ఆళ్ళ మోహన్ రావు లను ఏకిగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మారుపల్లి ప్రేమ్ కుమార్,గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిట్టల నాగేశ్వరరావు,మాజీ గ్రామ అద్యక్షులు పంది వెంకులు,యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు భూక్యా భద్రు నాయక్,మండల సోషల్ మీడియా కన్వీనర్ దేగల వేలాద్రి,గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొర్రేముచ్చు ఆనందరావు,పిట్టల దుర్గారావు,పిట్టల సురేష్, తదితరులున్నారు.

# కన్ఫ్యూజన్ లో పొంగులేటీ..!



ఖమ్మం, జూన్ 13, :అనుచరులకు, అయినవాళ్లకు శీనన్నగా ఆప్తుడు.. రాజకీయాల్లో పొంగులేటిగా పరిచయున్నుడు.. పొలిటికల్ ఎనివిూన్‌కు అర్థంకాని మనిషి..ఎంత చనువున్నా.. ఎవరితోనూ మనసులోమాట పంచుకోడు. ఆత్మీయ సమ్మేళనాలు ఎన్ని చేసినా..అర్థబలం..అంగబలం పుష్కలంగా ఉన్నా..బయటకు మాత్రం సౌమ్యంగా కనిపించే నిగర్వి ప్రయాణం ఇప్పుడు ఎక్కడికి..ఆయన అడుగు పెట్టే పార్టీ ఏది. స్వతహాగా కాంట్రాక్టర్ అయిన పొంగులేటి వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై అభిమానంతో 2013 ఫిబ్రవరి 23న వైసీపీలో చేరారు. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అదే సంవత్సరం ఖమ్మం లోక్‌సభ నుంచి వైసీపీ తరపున నిలబడి ఎంపీగా గెలిచారు. అయితే వైసీపీ ఏపీకి పరిమితం కావడంతో.. 2016 మే 3న సీఎం కేసీఆర్ పిలుపు మేరకు అప్పటి టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో జరిగిన లోక్‌సభ ఎన్నికతో పాటు, ఎమ్మెల్సీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించారు. ఏడేళ్లుగా పార్టీలో విధేయతగా ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడుతుంటే..కేసీఆర్ తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదనే ఆరోపణతో 2023 జనవరి నుంచి అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌పై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనుచరులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. దీంతో పొంగులేటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ బీఆర్‌ఎస్ పెద్దలు.. ఏప్రిల్ 10న బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేశారు. అప్పటి నుంచీ పొంగులేటి ఏ పార్టీలో చేరతారని జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల్లో చర్చనీయాంశమైంది. దీంతో ఆయన పార్టీలో చేరే విషయంలో ఆయన ఇంకా కన్ఫ్యూజన్‌లోనే ఉన్నారా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నారు. నిజానికి పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నారనే టాక్ జోరుగా వినిపించింది. ఈ మేరకు పొంగులేటి తన నిర్ణయాన్ని ఇవాళ మీడియా ముఖంగా అధికారిక ప్రకటన చేస్తారనే ప్రచారం జరిగింది. కానీ ఇప్పటి వరకు ఇటు ఖమ్మం, అటు హైదరాబాద్ మీడియాకు పొంగులేటి నుంచి ఆహ్వానం అందలేదు. కాంగ్రెస్‌లో చేరేందుకు దాదాపు ఖాయం అయినప్పటికీ తాను కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటే తనకు ఎదురయ్యే ఇబ్బందులను పొంగులేటిని డైలామాలో వడేసినట్లు తెలుస్తోంది.కాంగ్రెస్‌లో చేరితే తన గెలుపు సులువే అయినా తన అనుచరులందరికీ టికెట్ల విషయంలో పేచీ ఏర్పడే అవకాశం ఉందని దాంతో పార్టీలో చేరేందుకు అగ్రనాయకత్వం ఓకే అన్నా స్టేట్ లీడర్లతో ఇబ్బందులు తప్పవని పొంగులేటి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ధైర్యంచేసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నా ఒకవేళ హస్తం పార్టీ అంతిమంగా అధికారంలోకి రాకపోతే కేసీఆర్‌పై తాను చేసిన శపథం అసంపూర్తిగానే ఉండిపోతుందనే అభిప్రాయం పొంగులేటిని ఆలోచనలో పడేసిందనే టాక్ వినిపిస్తోంది. ఇక బీజేపీలో చేరితే తనతో పాటు తన అనుచరుల విజయం సవాలుగా మారనుందని ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు.. ఎప్పుడైతే బీఆర్ఎస్ నుంచి బయటకొచ్చారో? అప్పటి నుంచి బీఆర్‌ఎస్‌కు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఊహించని వ్యూహాలతో ముందుకెళ్తున్నారు.కొంతకాలం కొత్త పార్టీ పెడతారని జోరుగా వీలర్స్ వచ్చాయి. ఆ తర్వాత కమలనాథులతో చర్చలు జరపడంతో..కాషాయ కండువా కప్పుకుంటారని ఊదరగొట్టారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరడం కన్ఫామ్ అంటున్నారు. కోమటిరెడ్డి కూడా అదే చెబుతున్నారు. కానీ పొంగులేటి మాత్రం తొణకడం లేదు. ఏమాట చెప్పడం లేదు. అసలు మనసులో ఏముందో ఎవరికీ అర్థం కావడం లేదు.

## మ్యూజిక్ కంపోజర్‌గా ఖతీజా



ముంబై, జూన్ 13, :ఎన్నో సూపర్ హిట్ పాటలు ప్రపంచానికి అందించిన ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఫ్యామిలీ నుంచి సినీ ఇండస్ట్రీకి మరిన్ని సూపర్, డూపర్ హిట్‌లను అందించేందుకు, మ్యూజిక్ లవర్స్‌ను అలరించేందుకు మరోకరు రాబోతున్నారు. అది ఎవరో కాదు రెహమాన్, సైరా బానుల పెద్ద కూతురు ఖతీజా రెహమాన్. పలు ఆసక్తికరమైన పాటలతో కోక్ స్టూడియో ద్వారా అరంగేట్రం చేసిన ఆమె.. ఇప్పటికే సంగీత ప్రియుల ప్రశంసలను అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె కూడా తన తండ్రిలా ఫుల్ టైమ్ మ్యూజిక్ డైరెక్టర్‌గా మారేందుకు సిద్ధమవుతున్నారు.'సిల్లు కారుపట్టి' ఫేమ్ హలిత షమీమ్ దర్శకత్వం వహించిన తమిళ సనిమా 'మిన్మిని'తో ఖతీజా రెహమాన్ సంగీత దర్శకురాలిగా అరంగేట్రం చేయడానికి ఖతీజా సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా మూవీ దర్శకుడు ఆమెను సోషల్ మీడియా ద్వారా సినీ ప్రేక్షకులకు పరిచయం చేశారు. రికార్డింగ్ స్టూడియోలో ఖతీజాతో కలిసి ఉన్న చిత్రాన్ని పంచుకున్నారు, "మిన్మిని కోసం అసాధారణ ప్రతిభ గల ఖతీజా రెహమాన్‌తో కలిసి పని చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది" అంటూ ఆమె పేర్కొన్నారు. కాగా మిన్మినీలో ఎస్తేర్ అనిల్, హరి కృష్ణన్, గౌరవ్ కలై , ప్రవీణ్ కిషోర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.మణిరత్నం ఎపిక్ యాక్షన్–అడ్వెంచర్ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్: ఎవ' లో ంఖీ రెహమాన్ కూతురు ఖతీజా ఇప్పుడు తన తండ్రి, సోదరుడు అమీన్ అడుగుజాడల్లో నడుస్తుండడంపై ప్రేక్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కంపోజింగ్ ప్రపంచంలోకి ప్రవేశిస్తోన్న ఖతీజాకు నెటిజన్లు కూడా సపోర్ట్ ఇస్తున్నారు. ఆల్ ది బెస్ట్ చెబుతూ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. 2010లో తెరకెక్కిన ఎస్ శంకర్ చిత్రం 'ఎంథిరన్'లో ప్లేబ్యాక్ సింగర్‌గా ఖతీజా అరంగేట్రం చేసింది. ఆమె రెహమాన్, ఎస్పి బాలసుబ్రహ్మణ్యంతో కలిసి 'పుతియ మనిధ' పాటకు తన గాత్రాన్ని అందించింది. ఆ తర్వాత మరో ఆరు సినిమాల్లోనూ పాటలు పాడింది. ఇవన్నీ విపరీతమైన ప్రజాదరణ పొందాయి. ఇప్పుడు మ్యూజిక్ కంపోజర్ గా ప్రేక్షకులను అలరించబోతున్న ఖతీజా సంగీతం కోసం సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.తండ్రి ఏఆర్ రెహమాన్ కంపోజింగ్ లోనూ తన కూతురు ఖతీజా రెహమాన్ పలు సినిమాల్లో పాటలు పాడి మంచి స్వరకర్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. వాటిలో ఎంథిరన్ రొబోట్(2010), మిమి(హిందీ చిత్రం - 2021), ఇరవిన్ నిజల్ (2022), మిలి(హిందీ చిత్రం - 2022), పొన్నియన్ సెల్వన్ పార్ట్ - 2 వంటి చిత్రాల్లో ఖతీజా పాటలు పాడి, తండ్రికి తగ్గ తనయగా పేరు తెచ్చుకున్నారు.

## స్కూలు బస్సుల తనిఖీలు

యాదాద్రి :యాదాద్రి భువనగిరి జిల్లాలో పాఠశాలలు పునర్ ప్రారంభం కావడంతోటి రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. 18 బస్సులను పట్టుకున్నారు. అందులో రెండు బస్సులను సీజ్ చేయడం జరిగింది. మిగతా బస్సులకు సంబంధించిన ధృవీకరన పత్రాలను చెక్ చేస్తున్నారు. భువనగిరి చౌటుప్పల్ పోచంపల్లి ఆలేరు యాదగిరిగుట్ట ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. స్కూల్ విద్యార్థుల్ని తీసుకెళ్లి స్కూల్ బస్సులను పట్టుకోవడం జరిగింది. సరైన నిబంధనల ప్రకారం లేని బస్సులను సీజ్ చేశారు. స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి అని రవాణాశాఖ అధికారులు అంటున్నారు.

## జగ్గారెడ్డి... రిటైర్మెంటేనా..?



మెదక్, జూన్ 13, :తెలంగాణ కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమంతోనో, మాటలతోనో వార్తల్లో ఉండే నాయకుడు జగ్గారెడ్డి. ఎందుకో.. గత కొన్ని నెలలుగా మ్యూట్ మోడ్‌లోకి వెళ్ళిపోయారాయన. మాటలే కాదు.. ఆయన ఎవరికీ కనిపించడం కూడా లేదట. ఎందుకన్నది ఎవరికీ తెలియడం లేదట. అందుకే ఆ మౌనానికి అర్థాలు, నానార్థాలు, విపరీతార్థాలు వెదికే పనిలో ఉన్నారట గాంధీభవన్‌లో కొందరు. చాలా రోజుల నుంచి మౌనముద్రలో ఉన్నారు టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి. అడపా దడపా నోరు తెరిచినా? నైరాశ్యపు మాటలు తప్ప మునుపటిలా ఉరుములు, మెరుపులు ఉండటం లేదు. రాహుల్ గాంధీ పాదయాత్రకు ముందు కూడా చాలా రోజులు ఇలాగే గాయబ్ అయ్యారు జగ్గారెడ్డి. దీంతో ఆయన ఏం చేస్తారు? ఏం చేయబోతున్నారన్న చర్చ జరిగింది.రాహుల్ పాదయాత్రలో రీ ఎంట్రీ ఇచ్చిన జగ్గారెడ్డి ఆ తర్వాత కూడా కామ్‌గానే ఉన్నారు. అలా ఎందుకంటే? చేసే వాళ్ళని చేయనివ్వండి.. నేను మాట్లాడితే నష్టమంటున్నారట.. పైగా కోవర్టులంటున్నారని అసహనంగా ఉన్నట్టు తెలిసింది. పార్టీ కోసం ఎవ్వరూ మాట్లాడని రోజుల్లో కూడా? కేసీఆర్‌కి వ్యతిరేకంగా తాను కార్యక్రమాలు నిర్వహించానని, ఆ సేవల్ని గుర్తించకుండా సింపుల్‌గా కోవర్ట్ ముద్ర వేస్తుంటే ఏం చేయాలని సన్నిహితుల దగ్గర ఆవేదన వ్యక్తం చేస్తున్నారట జగ్గారెడ్డి. జరుగుతున్న తప్పుల్ని సరిదిద్దుకోవడం మానేసి.. పార్టీ మంచి కోసం మాట్లాడే వాళ్ళ మీద ముద్రలు వేసుకుంటూ పోతే నష్టం ఎవరికని అడుగుతున్న జగ్గారెడ్డికి?. ఇప్పుడు కొత్తగా అధిష్టానం కూడా తనను లైట్ తీసుకుంటోందా అన్న అనుమానం కలుగుతోందట.తాను.. ఎందుకు యాక్టివ్‌గా లేనో తెలుసుకోవాలన్న విషయాన్ని మర్చిపోయారంటూ అసహనంతో రగిలిపోతున్నారట జగ్గారెడ్డి. పీఏసీ మీటింగ్‌లు, పార్టీ సభలు, సమావేశాల్లో హడావిడి చేసే లీడర్ ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారన్న పట్టింపే నాయకత్వానికి లేదా అన్న ప్రశ్నలు గాంధీభవన్‌లో వినిపిస్తున్నాయట. ఓ వైపు ఎన్నికలు దగ్గర పడుతుంటే.. అందర్నీ కలుపుకోవాల్సింది పోయి.. జగ్గారెడ్డిని ఇలా వదిలేస్తారా అన్న చర్చ సైతం జరుగుతోందట. అంతకు ముందు ఒకటి రెండుసార్లు ఇన్చార్జ్ థాక్రేని కలిసి పార్టీని ఎన్నికలకు సిద్ధం చేసే అంశాలపై చర్చించారట జగ్గారెడ్డి . గ్రేటర్ హైదరాబాద్‌లో బలహీనంగా ఉన్నామని, పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు ఇన్చార్జ్‌లను కూడా నియమించకపోవడం లాంటి అంశాలను చర్చించారట. కానీ.. ఆ తర్వాత తన సూచనలపై చర్చ జరగడం గానీ, వాటికి సంబంధించి చర్యలు తీసుకోకపోవడంగానీ..లేకపోవడంతో తీవ్రంగా రగిలిపోతున్నారట జగ్గారెడ్డి. అది నియోజకవర్గ సమస్య అయినా.. పార్టీ సమస్య అయినా.. ఘాటుగా స్పందించే అలవాటున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మౌనం దేనికి సంకేతమన్న చర్చ టి కాంగ్రెస్‌లో జరుగుతోంది. అందర్నీ కలిపి పని చేయించాలన్న కర్ణాటక ఫార్ములానే తెంలగాణలో కూడా అమలు చేయాలనుకుంటున్న కాంగ్రెస్ అధిష్టానం ఈ వ్యవహారాన్ని ఎలా డీల్ చేస్తుందో చూడాలి.

## సర్కారీ స్కూళ్లలో భారీగా అడ్మిషన్లు

మెదక్, జూన్ 13, :విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం సర్కారీ స్కూళ్ల రూపురేఖలను పూర్తిగా మార్చివేసింది. నాణ్యమైన విద్య, చక్కటి మౌలిక వసతులు కల్పించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బడులకు ఇప్పుడు ప్రైవేటు స్కూళ్ల నుంచి వలసలు పెరుగుతున్నాయి. 'బడిబాట' ద్వారా జిల్లాలో ఇప్పటివరకు సుమారు 5,074 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ప్రవేశాలు పొందారు. ఒక్కరోజే అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 113, ప్రైవేటు స్కూళ్ల నుంచి 64, నేరుగా అడ్మిషన్లు 250 వరకు ఉన్నట్లు డీఈవో తెలిపారు. కాగా, రేపటి నుంచి స్కూళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా విద్యాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో బడిబాట కార్యక్రమం జోరుగా కొనసాగుతున్నది. విద్యార్థుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నది. ప్రైవేటు స్కూళ్ల నుంచి సర్కార్ బడుల్లో చేరేందుకు విద్యార్థులు జైకొడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 1 నుంచి 9వ తరగతి వరకు దాదాపు 5,074 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ప్రవేశాలు పొందినట్లు డీఈవో ఆర్.రోహిణి వివరించారు. ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం ఒక్కరోజే అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 113, ప్రైవేటు స్కూళ్ల నుంచి 64, డైరెక్ట్ అడ్మిషన్లు 250 వరకు జరిగినట్లు తెలిపారు.స్కూళ్లను, స్కూల్ పరిసరాలతోపాటు తాగునీటి సదుపాయాలు వంటి సకల ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న మధ్యాహ్న భోజన పథకం కూడా జిల్లాలో తొలిరోజు నుంచే అమలుపరిచేలా మండలస్థాయి విద్యాధికారులను డీఈవో ఆదేశించారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అమలు చేయాల్సిన అన్ని పథకాలు ప్రారంభిస్తున్నారు.'మన బస్తీ–మనబడి' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అన్ని స్కూళ్లు ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయి. మరుగుదొడ్లు, తాగునీరు, కరెంటుతోపాటు క్లీన్ అండ్ గ్రీన్ ఉండే విధంగా గ్రీనరీ అమలు చేస్తున్నారు. స్కూళ్లకు జాతీయ నాయకులతో పెయింటింగ్ వేస్తున్నారు. పైగా ప్రభుత్వ పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఫలితాలు కూడా నమోదవుతున్నాయి. గత పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కూడా జిల్లాలో తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఫలితాలు నమోదైనట్లు డీఈవో తెలిపారు. పైగా జిల్లాల్లో ఉన్న దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన అందుబాటులో ఉంది. పదో తరగతి ఫలితాలు మెరుగుపడుతున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు పొందడానికి ఆసక్తి చూపుతున్నారని జిల్లా అధికారి తెలిపారు.

## మోడల్ స్కూల్ లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం: ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్



అసిఫాబాద్ జిల్లా జూన్ 13 (ప్రజాపాలన, ప్రతినిధి) : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ,అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు తెలుగు, ఆంగ్లం, గణితం, రసాయన శాస్త్రం సబ్జెక్టులు, 6 నుండి 10వ తరగతి వరకు హిందీ బోధించుటకు ఆసక్తి గలవారు ఈ నెల 15వ తేదీ లోగా ధృవపత్రాల జిరాక్స్ ప్రతులతో పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వేతనం గరిష్టంగా నెలకు రూ 18200/- ఉంటుందని తెలిపారు. భాషేతర పోస్టులకు ఆంగ్ల మాధ్యమం లో బోధించాల్సి ఉంటుందని తెలిపారు.

## మండలంలో పర్యటించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కోటా రాంబాబు





బోనకల్ జూన్ 13 ప్రజాపాలన ప్రతినిధి: మండలంలో ప్రముఖ వైద్యులు, పొంగులేటి శ్రీనన్న మధిర నియోజకవర్గ ఇన్చార్జి డా.కోట రాంబాబు మంగళ వారం పర్యటించారు. ముందుగా మండల పరిధిలోని గోవిందాపురం గ్రామంలో సతీష్ కుమార్తె, కుమారుడు నూతన వస్త్రాలంకరణ వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించి వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. అదేవిధంగా అదే గ్రామంలో బడుగు నాగేశ్వరావు అనారోగ్యంతో అకాల మరణం పొందగా వారి మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి వారికి ఆర్థిక సహాయం అందించారు.అనంతరం పెద్దబీరువల్లి గ్రామంలో యేసు అకాల మరణం పొందగా వారి మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి వారికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పొంగులేటి శీనన్న సైన్యం బాగం నాగేశ్వరావు, హనుమంత్ రావు, బొనకల్ ఉప సర్పంచ్ యార్లగడ్డ రాఘవ, తోటకూర వెంకటేశ్వర్లు, పంజల రాజేష్, గొడుగు కృష్ణ, కొమ్ము ఉపేంద్ర, ప్రేమ్ కుమార్, లడ్డా తదితరులు ఉన్నారు.


## కార్పొరేటర్ గీత ప్రవీణ్ ను కలిసిన చిలుకానగర్ మాల సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రతినిధులు



మేడిపల్లి, జూన్13 (ప్రజాపాలన ప్రతినిధి): చిలుకానగర్ మాల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా నూతన అధ్యక్షులు అల్లిబిల్లి మహేందర్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ అధ్యక్ష, కార్యదర్శులను శాలువాతో సన్మానించారు. అనంతరం కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సంఘ సభ్యులు కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్, ఉపాధ్యక్షులు మాస దామోదర్, కోశాధికారి కోండ్ర కనకరాజు, మరియు సంఘం సలహాదారులు పడిగం రామ్ నరసయ్య, దేవుళ్ళ పురుషోత్తం, పోడిశెట్టి కృష్ణ, వజ్జల ఆంజనేయులు, అనుముల వీర, జాయింట్ సెక్రెటరీ మంచినీళ్ల శ్రీనివాస్, ఉప కోశాధికారి మామిడి పోచయ్య, అదేవిధంగా కార్యవర్గ సభ్యులు అల్లూరి బాబురావు, కుతలరామకృష్ణ, మన్నెపు శ్రీనివాస్ రావు, కొండ నరేష్ , జోరుక సుదర్శన్, మేకల అనిల్, సుదమల్ల భాస్కర్, భోజ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఆకట్టుకుంటున్న విజయ్ ఆంటోనీ "విక్రమ్ రాథోడ్" ఫస్ట్ లుక్!




కెరీర్ ఆరంభం నుంచే వైవిధ్యభరితమైన పాత్రలు పోషిస్తూ బిజీ ఆర్టిస్ట్ అయ్యారు విజయ్ ఆంటోనీ. విలక్షణ నటనతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతున్న ఆయన, రీసెంట్ గానే బిచ్చగాడు 2 సినిమాతో సూపర్ సక్సెస్ అందుకున్నారు. అదే జోష్ లో ఇప్పుడు మరో డిఫరెంట్ కాన్సెప్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. విజయ్ ఆంటోనీ హీరోగా విక్రమ్ రాథోడ్ సినిమా తెలుగులో రాబోతోంది. అపోలో ప్రొడక్షన్స్, మూవీస్ సంయుక్త సమర్పణలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు బాబు యోగేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. రావూరి వెంకటస్వామి, కౌసల్య రాణి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజా సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పోస్టర్ లో ముఖంపై గాయాలతో కనిపిస్తున్నారు విజయ్ ఆంటోనీ. సీరియస్ లుక్ లో ఆయన కనిపిస్తుండటం, ఎవరో పిస్తోల్ తో ఆయన్ను గురిపెట్టడం చూపిస్తూ సినిమా పట్ల ఆసక్తి రేకెత్తించారు. శ్రీ శివ గంగ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతోంది. అతి త్వరలో ఈ మూవీ రిలీజ్ డేట్ ప్రకటించనున్నారు మేకర్స్. ఈ చిత్రంలో సురేష్ గోపి, రమ్య నంబీశన్, సోను సూద్, సంగీత ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, ఛాయా సింగ్, యోగి బాబు, రాధ రవి, కస్తూరి శంకర్, రోబో శంకర్, మనీష్ కాంత్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

## సీతమ్మ నిర్మాత కాబోతుందండోయ్!

‘అదిపురుష్’ సినిమాతో బాలీవుడ్ భామ కృతిసనన్ సీతమ్మగా పాన్ ఇండియా లో ప్రేక్షకుల్ని మెప్పించబోతుంది. సీత పాత్ర పోషించడం అన్నది ఏ నటి అయినా అదృష్టం..గౌరవంగానే భావిస్తారు. చాలా అరుదుగా మాత్రమే దొరికే పాత్రలివి. రామాయణం కథలో నటించడం అంటే నిజంగా పెట్టి పుట్టి ఉండాలి. ఆ ఛాన్స్ కృతిసనన్ కి దక్కడం నిజంగా లక్కీ గాళ్ అనే అనాలి. ఇప్పటికే సీత ఆహార్యంలో కృతిసనన్ ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. తొలుత సినిమాపై నెగిటివిటీ స్ప్రెడ్ అయినా రిలీజ్ సమయానికి అదంతా పాజిటివ్ వైబ్ గా మారిపోయింది. ఈ సినిమా రిలీజ్ అవ్వడం..వచ్చే ఏడాదితో కృతిసనన్ ఇండస్ట్రీకి వచ్చి దశాబ్దం పూర్తవ్వడం కూడా విశేషం. ఈ నేపథ్యంలో కృతిసనన్ నిర్మాతగానూ రంగ ప్రవేశం చేస్తుంది. చిత్ర నిర్మాణంలో వివిధ కోణాల పట్ల.. నిర్మాణం పట్ల



ఆసక్తి తో నిర్మాతగా మారుతున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఓ స్టోరీ కూడా లాక్ చేసిందిట. వచ్చే ఏడాది ఆ చిత్రాన్ని సెట్స్ పైకి తీసుకెళ్లబోతుందిట. అయితే ఇందులో ఆమె నటిస్తుందా? లేక కేవలం నిర్మాతగానే కొనసాగుతుందా? అన్నది సస్పెన్స్. అలాగే ఈ సినిమాకి దర్శకుడు ఎవరు? ఇతర నటీనటుల వంటి వివరాలు వచ్చే ఏడాది వరకూ తెలిసే అవకాశం లేదు. ఇప్పటికే బాలీవుడ్ కంగన రనౌత్.. అనుష్క శర్మ..దియా మీర్జా.. ట్వింకిల్ ఖన్నా..మాధురీ దీక్షిత్.. చిత్రాంగదా సింగ్..తాప్సీ వంటి భామలు నటిస్తూ నిర్మాతలగానూ కొనసాగుతున్నారు. ఇంకా కొంత మంది సీనియర్ భామలు అనధికారికంగా సినిమాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. నవతరం నాయికలు సైతం ఓటీటీ కంటెంట్ ని స్వీయా నిర్మాణంలో తెరకెక్కిస్తున్నారు. వీళ్లంతా బాలీవుడ్ లో సక్సెస్ ఫుల్ నిర్మాతలుగా కొనసాగుతున్నారు. వాళ్లని స్ఫూర్తిగా తీసుకుని కృతిసనన్ కూడా నిర్మాతగా మారుతున్నట్లు తెలుస్తుంది. సినిమాల్లో సంపాదించింది ఇక్కడే పెట్టుబడి పెట్టాలి. తనతోటి వారు కూడా అవకాశాలు అందుకోవాలి అన్న సానుకూల దృక్పథం ప్రశంసనీయం.

## పవన్ సినిమాలో స్టార్ హీరో మరదలు

రీఎంట్రీ ఇచ్చిన తర్వాత ఏమాత్రం రెస్ట్ లేకుండా సినిమాల మీద సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాడు మెగా హీరో పవన్ కల్యాణ్. ఇప్పుడు ఒకేసారి అతడు నాలుగు సినిమాల్లో నటిస్తున్నాడు. అందులో యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ సుజిత్ తెరకెక్కిస్తోన్న ‘ఓజి’ ఒకటి. ఒరిజినల్ గ్యాంగ్స్టర్ స్టోరీతో రాబోతున్న ఈ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. ఫుల్ లెంగ్త్ యాక్షన్ జోనర్లో వస్తున్న ‘ఓజి’ మూవీని పాన్ ఇండియా రేంజ్లో ప్లాన్ చేస్తున్నారు. అందుకే ఈ చిత్రం కోసం పక్క ఇండస్ట్రీలకు చెందిన నటీనటులను తీసుకుంటున్నారు. ఇలా ఇప్పటికే దేశ వ్యాప్తంగా గుర్తింపును తెచ్చుకున్న చాలా మంది యాక్టర్లను ఈ చిత్రంలో భాగం చేశారు. వాళ్లంతా ఇప్పటికే పవన్ కల్యాణ్తో కలిసి షూటింగ్లో సైతం పాల్గొంటూనే ఉన్నారు. క్రేజీ కాంబినేషన్లో రూపొందుతోన్న ‘ఓజి’ మూవీలో మరో పవర్ఫుల్ లేడీని కూడా భాగం చేశారు. ఆమె ఎవరో కాదు.. కోలీవుడ్లో ఎన్నో చిత్రాల్లో హీరోయిన్గా సపోర్టింగ్ ఆర్టిస్టుగా నటించిన శ్రీయా రెడ్డి. ఈ బ్యూటీనే ఇప్పుడు పవన్ కల్యాణ్ సినిమాలో కీలక పాత్రను చేస్తుంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటిస్తూ.. ఆమెకు సోషల్ మీడియా ద్వారా వెల్కం చెప్పింది. హీరో విశాల్ మరదలు అయిన శ్రీయా రెడ్డి.. విక్రమ్ నటించిన ‘సమురాయ్’ అనే సినిమాతో నటిగా ప్రయాణం మొదలు పెట్టింది. ఆ తర్వాత తెలుగులో ‘అప్పుడప్పుడు’ అనే సినిమాలో నటించింది. ఇక విశాల్ నటించిన ‘పొగరు’ మూవీతో ఆమె రేంజ్ పెరిగిపోయింది. ఆ తర్వాత కూడా తెలుగు తమిళం మలయాళంలో ఎన్నో సినిమాల్లో ఆమె నటించి మెప్పించింది. ఇలా ఇప్పుడు ‘సలార్’లోనూ నటిస్తోంది. “ఓజి” మూవీలో సైతం శ్రీయా రెడ్డి ఓ పవర్ఫుల్ నెగెటివ్ రోల్నే చేస్తున్నట్లు అప్పుడే ప్రచారం మొదలైంది. దీంతో ఆమె పాత్రపై అంచనాలు పెరుగుతున్నాయి. ఇక ఈ సినిమాను డీవీవీ దానయ్య




నిర్మిస్తున్నారు. ఇందులో ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్గా చేస్తోంది. థమన్ దీనికి మ్యూజిక్ ఇస్తున్నాడు. ఈ సినిమాను క్రిస్మస్ కానుకగా విడుదల చేసే అవకాశం ఉంది.


## నిఖిల్ "స్పై" రిలీజ్ రూమర్స్ పై క్లారిటీ.!

మన టాలీవుడ్ యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ ఇపుడు బ్యాక్ టు బ్యాక్ రెండు సాలిడ్ థ్రిల్లర్స్ తో అయితే మంచి హిట్స్ ని అందుకున్న సంగతి తెలిసిందే. మరి ఈ రెండు హిట్స్ తర్వాత మరో ఇంట్రెస్టింగ్ యాక్షన్ కం "స్పై" థ్రిల్లర్ తో తాను రాబోతున్నాడు. మరి పాన్ ఇండియా వైడ్ మంచి బజ్ ని సొంతం చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ ఎడిటర్ టర్న్డ గ్యారీ బి హెచ్ దర్శకత్వం వహించగా ఈ చిత్రం నుంచి అయితే ఇపుడు రిలీజ్ కి సంబంధించి కొన్ని రూమర్స్ అయితే వచ్చాయి. ఈ జూన్ 29 నుంచి సినిమా వాయిదా పడొచ్చని టాక్ రాగా దీనిపై ఇప్పుడు అఫీషియల్ క్లారిటీ అయితే వచ్చేసింది. ఈ చిత్రం ఆన్ టైం రిలీజ్ ఉంటుంది అన్నట్టు యూఎస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిరా సినిమాస్ వారు జూన్ 28 ప్రీమియర్స్ ని అయితే కన్ఫర్మ్ చేశారు. అలాగే యూఎస్ లో భారీ మొత్తంలో ఈ చిత్రం 450కి పైగా లొకేషన్స్ లో అయితే ఈ చిత్రం రిలీజ్ కాబోతున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. దీనితో స్పై రిలీజ్ రూమర్స్ లో ఎలాంటి నిజం లేదని చెప్పొచ్చు.



## 468 కోట్లతో ప్రభాస్ ఊచకోత

యంగ్ రెబెల్ స్టార్ ప్రభాస్.. ఈ పేరుకు పెద్దగా పరిచయం అవసరం లేదు. ఆ రేంజ్లో ఇతగాడు చాలా కాలంగా ఇండియన్ సినిమా పై ప్రభావాన్ని చూపిస్తూ దూసుకుపోతోన్నాడు. ముఖ్యంగా పాన్ ఇండియా స్టార్ గా మారినప్పటి నుంచి భారీ చిత్రాల్లోనే నటిస్తున్నాడు. ఇందులో భాగంగానే ఇప్పుడు ప్రభాస్ ‘ఆదిపురుష్’ అనే మైథాలజీ మూవీ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్ నటించిన చిత్రమే ‘ఆదిపురుష్’. టెక్నికల్ వండర్గా రూపొందిన ఈ సినిమా పై ఆరంభంలో పెద్దగా హైప్ ఏర్పడలేదు. కానీ దీని నుంచి వచ్చిన టీజర్ ట్రైలర్ లు అంచనాల ను భారీ గా పెంచాయి. ఫలితంగా




ఈ మూవీకి వరల్డ్ వైడ్ గా డిమాండ్ ఏర్పడింది. దీంతో ఈ చిత్రం భారీ స్థాయి లో బిజినెస్ ను కూడా జరుపుకుంది. క్రేజీ కాంబినేషన్ లో రూపొందిన ‘ఆదిపురుష్’ మూవీకి సంబంధించిన ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లోని అన్ని ఏరియాల హక్కుల కు భారీ పోటీ నెలకొంది. ఫలితంగా ఇది తెలుగు రాష్ట్రాల్లో రూ. 120 కోట్లు మేర థియేట్రికల్ బిజినెస్ ను చేసుకుంది. తద్వారా ప్రభాస్ కెరీర్ లోనే అత్యధిక బిజినెస్ చేసిన చిత్రాల్లో మూడో స్థానానికి చేరింది. దీనికంటే ముందు బాహుబలి 2 రూ. 122 కోట్లతో ఫస్ట్ ప్లేస్ లో ఉంది. ‘ఆదిపురుష్’ మాత్రమే కాదు.. ప్రభాస్ నటించిన గత నాలుగు చిత్రాలు కూడా ఆంధ్రా తెలంగాణలో రూ. 100 కోట్లు కంటే ఎక్కువ బిజినెస్ను జరుపుకున్నారు. ఆ వివరాలను చూస్తే.. బాహుబలి 2 మూవీకి రూ. 122 కోట్లు బిజినెస్ జరగ్గా.. సాహోకు రూ. 121.60 రాధే శ్యామ్కు రూ. 105.20 కోట్లు ఆదిపురుష్ చిత్రాని కి రూ. 120 కోట్లు మేర వ్యాపారం జరిగింది. ఇలా ప్రభాస్ నటించిన గత నాలుగు చిత్రాల కు కలిపి ఏపీ తెలంగాణలోనే ఏకంగా రూ. 468.80 కోట్లు మేర ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగింది. తద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఇంత భారీ మొత్తంలో బిజినెస్ చేసిన ఏకైక హీరో గా ప్రభాస్ సంచలన రికార్డును నమోదు చేసుకున్నాడు. దీంతో ఈ పాన్ ఇండియా స్టార్ హీరో టాలీవుడ్లో సరికొత్త చరిత్ర ను సృష్టించినట్లు అయింది.

## 50 మిలియన్ తో సోషల్ మీడియా కింగ్ అల్లు అర్జున్.!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇప్పుడు తన మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా సినిమా "పుష్ప 2" తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అలాగే దీనితో పాటుగా ఓటిటి లో కూడా ఏదో ప్లాన్ చేస్తున్నారు. ఇక ఇదిలా ఉండగా అల్లు అర్జున్ కి అయితే ఇప్పుడు కాదు ఎప్పుడు నుంచో కూడా ఓ రేంజ్ లో సోషల్ మీడియాలో బన్నీ కి భారీ ఫాలోయింగ్ ఉంది. దాదాపు ఓ దశాబ్ద కాలం కితం నుంచే మిలియన్స్ కొద్దీ ఫాలోవర్స్ ని సొంతం చేసుకున్న బన్నీ ఇప్పుడు అయితే సోషల్ మీడియాలో మరింత ఫాలోయింగ్ ని పెంచుకున్నాడు. మరి లేటెస్ట్ గా అయితే ఏకంగా 50 మిలియన్ ఫాలోవర్స్ ని సొంతం చేసుకొని సౌత్ ఇండియా సినిమా దగ్గర ఏ సెలెబ్రెటీ కి కూడా లేని విధంగా భారీ నెంబర్ ఇప్పుడు బన్నీ సొంతం అయ్యింది. దీనితో సోషల్ మీడియా కింగ్ అల్లు అర్జున్ అనే మాట మరోసారి తాను ప్రూవ్ చేసుకున్నాడని చెప్పాలి.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part ‘A’), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989